# ఒక్క దణ్ణం

[కథ]

— శ్రీ జలసూత్రం రుక్మిణీనాథ్ —

"ఏమే, రామసీతా —"

దొడ్లో గాడిపొయ్యిదగ్గర నుంచుని కనకమ్మ అంది. యీపిలుపు గదిలో ఉన్న రామసీతకు వినబడ్లేదు. "ఊహూఁ. కింసరంగా అంటూ ఏం చేస్తోందో" అనుకుంది. "యిదీ మంచిదే. అది చూడకుండా వుంటేనే మంచిది. నరుడికంట నల్లరాయైనా పగులుతుందిట. ఎవరి కళ్లు ఎలాంటివో" అని అనుకుంది. కళాయిలో పులుసు తెర్లుతోంది. కరేపాకూ, కొత్తిమీరీ ఎప్పుడేసినా వెయ్యవచ్చు. సువాసనకేగా. ఆకాశానికేసి మెడ ఎత్తింది. చేతులు జోడించింది. నమస్కరించింది. "నారాయణమూర్తీ, తండ్రీ! నీవు చల్లగా చూచి అబ్బాయికి పేరు వొస్తే—"అంది. యింతలో అలికిడి ఆయింది. కోడలు వొస్తోందల్లే వుంది అనుకుని చేతులు దించింది. రామసీత వొచ్చి నుంచుంది— శాంతంగా, బంగారు బొమ్మలాగా.

"అప్పుడనగా పిలిస్తే యిప్పుడా అమ్మా రావడం?"

"వినబడ్లేదు అత్తయ్యా!"

"బాగానే ఉంది. కరేపాకూ అదీ తీసుకురా"

"కత్తీ కఠారీనా?"—నవ్వింది.

పులుసులో కొత్తిమీరీ, కరేపాకూ వెయ్యడం అంటే ఆంజనేయులుకు కిట్టదు. వాటి కతను కత్తీ కఠారీ అని పేరుపెట్టాడు. మొగుడిమాటలు విని రామసీతకూడా వాటిని కత్తీ, కఠారీ అంటోంది.

"ఊఁ" అంది కనకమ్మ. ఎప్పుడూ ఇది ఇంతే. భగవంతుడికి దణ్ణం పెట్టుకోటానికికూడా వీల్లేకపోతోంది. ఎల్లాగూ ఆలస్యం చేసే మరీ వొచ్చిందిగదా, దేముడికి దండం పెట్టుకున్నాకే రాగూడదూ? కాస్త ఏమన్నా నోరు తెరిచి అంటే... 'అత్తగారు ముండమ్మ' అంటారు. సరేలే. అనేవాళ్లకు నోరూ వాయీ ఉందీ? ఇంతకూ దేముడికి దండం పెట్టుకోటం పూర్తికానేలేదు. మాయదారితల్లి వొచ్చి మొదటికి తెచ్చింది.

"నారాయణమూర్తీ, తండ్రీ! నువ్వు చల్లగా చూచి ఇవాళన్నా అబ్బాయికి పేరూ అదీ కలిసివొస్తే—సత్యెన్నారాయణవ్రతం చేయిస్తాను." అనంది. ఆకాశంకేసి చూచింది. నమస్కరించింది. మృదువుగా చెంపలు వేసుకుంది.

రామసీత కరివేపాకూ, కొత్తిమీరీ తెచ్చింది. పడమటింట్లో సంచైతే లే అక్కరలేదు. అక్కడే ఉంటై. స్నేహితులు పదిమంది వొస్తారని ఆంజనేయులు చెప్పాడు. దొడ్లో గాడిపొయ్యి దగ్గిర వంట చేస్తోంది కనకమ్మ.

అత్తగారు చెంపలు వేసుకోడం రామసీత చూచింది. ఎందుకు చెంపలు వేసుకుంటోందో తెలీలేదు. వోవేళ తను పిలిస్తే వెంటనే రాక, కొత్తిమీరీ కరేపాకూ అవీ తెమ్మని చెబితేగాని తేలేదని కోపమేమో అనుకుంది.

"ఏం అత్తయ్యా, అల్లా ఉన్నారూ" అంది.

కనకమ్మ మాట్లాడలేదు.

సరే, కోపమే అయివుంటుం దనుకుంది రామసీత. ఏం చేస్తుంది తను? ఆవిడ పిలిచిందికాబోలు. వినబడలేదు. వినబడితే రాదూ? వొచ్చింది. చెప్పిన పని చేసింది. ఇంతలోనే కోపం ఐతే ఎల్లాగమ్మా వేగడం? అయినా తనకెందుకు? చూస్తూ ఊరుకుంటే సరి.

యివాళ నాటకం. ఆంజనేయులుముఠావాళ్లు ఆడుతున్నారు. రామసీతకు యీనాటకాలంటే గిట్టదు. తరతరాలా శిష్టాచారసంపన్నులయినవారి యింటో పుట్టింది ఆమె. ఆమెకు తన మొగుడు నాటకంలో వేషం వేస్తాడంటే ఏమిటోగా ఉంది. శుభ్రంగా తిని కూచోక లేనిపోని యీ వేషాలు ఎందుకు? అయినా అయినయింటి వాళ్లు నాటకాల్లో వేషాలు వేస్తారూ? "ఆయన లేడూ, నాటకాల్లో వేషాలు వేస్తాడే, ఆయనపెళ్లాం" అంటే ఎంత అపద్రిష్ట? అయినా తన కెందుకు? నోరుమూసుకు ఊరుకుంటే సరి అనుకుంది.

ఆయనన్ను సగం యీవిడే చెడగొట్టేది. "నీనాటకాలేమిటో నీగోలేమిటో - బైట యేమన్నా చెయ్ - యింటిమీదికి మాత్రం తీసుకురాకు" అని యీవిడేమన్నా అంటుందా? ఊఁహూఁ. అబ్బాయిస్నేహితులంతా దేముళ్లే. వాళ్లొచ్చేదీ, కొంపమీద పడి నానాగత్తరా చేసిపోయేదీనూ. పెద్దదిగదా తను, 'యిదేమిటి—'

అన్నదా ఏమన్నా? నవ్వుతూ చూస్తూ ఊరుకుంది. వొచ్చినవాళ్లల్లో కోపంక—

"అంజీ! మీ ఆవిడ చీరలూ, నగలూ తేరామా" అనం టాడూ? తన చీరలూ, నగలూమాట వాడనవచ్చా? ఊఁ. తన కేంనుకు? చూస్తూ ఊరుకుంటే సరి.

"అత్తా! అత్తా!!"

పక్కయింటివాళ్ల పిల్లవాడు. తనకోపమే.

"రా!"

రామసీత ఆపిల్లాడికి ఎదురువెళ్లింది. సరాసరి మాలిమిగా వొచ్చాడు ఆ అబ్బాయి.

వొస్తూనే—"అత్తా! నే నొకటడుగుతా చెప్తావూ?" అన్నాడు. రామసీత తల ఊపింది.

"తలూపితే కాదు. లేదు అనగూడదు."

—తలూపింది మళ్లీ ఆమె.

"కాదు" అనగూడదు.

—నవ్వింది.

"నవ్వితే వేమమ్మా. ఊఁ—"

అసలేమిటో తెలీకపోయినా. ఊరికే, ఏమిటో చెప్పకుండా వుంటే — మరింత నవ్వొస్తోంది ఆమెకు.

"నిజంగా నేనమ్మా!"

"చెప్పూ మరి."

"ఇవాళ మన ఊళ్లో ఏమిటో చెప్పుకో."

రామసీతకు అర్థంకాలేదు. 'తెలీ'దంది.

"ఏఁ. ఇంతేనా? నే చెప్పనా?"

"ఊఁ."

"నాటకం."

మనస్సుకు కాస్త హుషారు కావాలన్నప్పుడు పిల్లలదగ్గిరుంటే చాలు; నవ్విస్తారు. కాని, వాళ్లే ఓఅప్పుడు తమకు తెలీకుండానే సూటిగా గుచ్చినట్టు మాట్లాడి గిలగిలలాడిస్తారు.

"సరేలే—" అంది.

తనలాగానే అందరూ అనుకోవడం మానవస్వభావం. ఇది అమాయికత్వప్రదిప్నం. అమాయికత్వం యింకా ఎంత ప్రకాశిత కాదో అంత సూటిదనం ఉంటుంది. పసిపిల్లల్లో ఈ ఇది మరీనూ. పసివాడు నాటకంపేరెత్తకపోతే హాయిగా ఉండేది. పసివాడికి లాలన జరిగేది. తనే నాటకం ప్రస్తావన తెచ్చిఉండేదేమోగూడాను. హృదయశాంతికోసం. పిల్లాడే ముందు నాటకంమాట తెచ్చేసరికి రామసీతకు మన సొకలా గయింది. తన యిది వాడిదగ్గిర వెళ్లబుచ్చటం దేనికి, దీనిమీద చిటికిచిటికి గాలివానకావడం దేనికి అనుకుంది ఆమె.

ఏమయినా తను యీ నాలుగ్గుడిదులా చూస్తూ ఊరుకుండ దలుచుకుంది.

"ఊఁ"

"అదేమిటత్తా, ప్రశ్నానికి 'ఊఊఁ' అంటావ్? నవ్వుతూ మాట్లాడవేం?"

రామసీత నవ్వింది.

"అమ్మయ్య! నాటకానికి తీసికెళ్తానన్నమాటే—"

పసివాడి ధోరణి బోధపడింది. వాడు నాటకం చూట్టానికి ఇదవుతున్నాడు. తనేం చెప్తుందీ? చూస్తూ ఊరుకుంది.

"ఏమత్తా, తీసుకెళ్లవుటమ్మా అత్తా!"

"అల్లాగే."

"నిజంగానా?

పసివాడు రాముడు నమ్మలేకపోయాడు. కష్టసాధ్యం విన వరం తేలిగ్గా వొస్తే ఎవరైనాసరే, తొందరగా నమ్మలేరు.

రామసీత తలూపింది.

రామసీతకు తన బాల్యం గుర్తుకొచ్చింది. సముద్రస్నానాలకూ, వాటికీ తను యింతే చేసేది. తన పరికిణీ, చొక్కా అవీ ముందే భద్రపరుచుకునేది. వెళ్లాలన్న ఉత్సాహంకొద్దీ వొచ్చిన చుట్టాలను యిలాగే అడిగేది. వెపోయినై ఆరోజులు.

ఇంతలో గబగబా ఆంజనేయులు ఇంటికి వొచ్చాడు. కొంపలు మింటికొట్టివస్తూన్నట్టు వొచ్చాడు. సావిట్లో అతనికి రామసీత కనిపించింది. పక్కని రాముడూ ఉన్నాడు.

"మాఅమ్మేదీ—?" అన్నాడు ఆంజనేయులు.

"దొడ్లో వున్నారు" అంది ఆమె.

ఆంజనేయులు సరాసరి దొడ్లోకి వెళ్లాడు. కనకమ్మ వంటంతా పూర్తిచేసుకుంది. స్నానం చెయ్యాలోతోన్నది.

"అమ్మా, వంటైందా?"

"ఆహా"

"వంటమాట కేంగానీ, చిక్కొటి వొచ్చిపడ్డదే"

కనకమ్మ తలెత్తింది.

"చీరెలు రెండు కావాలమ్మా. కాసిని నగలూ కావాలి"

"నాన్నడుగు. నన్నడుగుతా వేం"

"సరేలే. అది ఇవాళ చెప్తే వినేట్టుందీ—"

రామసీతకు యీమాటలు వినబడ్డాయి. సరాసరి వొచ్చింది.

"అల్లాగే—ఏం కావాలో తీసుకోండి"

ఆంజనేయులు తెల్లబోయాడు. ఇవ్వనంటుందనీ, తగవు జరుగుతుందనీ ఆలోచిస్తూ వొచ్చాడతను. ఏమాటమీద ఏమాట విసరాలో, అసలు తగవు ఎలా జరుగుతుందో అదంతా అతను

తనలో తాను ఊహించాడు. ఒక రిహార్సల్ కూడా చేసుకువొచ్చాడు. అదంతా మబ్బులు తేలిపోయినట్టు తేలిపోయింది.

'పద' అన్నాడు.

రామసీత తన కావిడిపెట్టె తీసింది. పక్కకు తప్పుకుంది. కొర్నాటిచీరా, ఉప్పాడచీరా, మరోపట్టుచీరా తీసుకున్నాడు. పెట్టెఅంతా కెలికాడు. పెట్టె మూతపెట్టి వొచ్చాడు.

"పెళ్ళోవిగూడా యిస్తావా?" అన్నాడు.

"నాం దేముందీ, తీసుకోండి"

పేచీ వొస్తుందనుకున్న చోట పేచీ రాకపోవడం ఎంతో నిరాశను కలిగిస్తుంది. ఎంతో ప్రేమైనా ఉండాలి, కావలిసినంత అసహ్యంఅన్నా ఉండాలి పేచీ రాకపోటానికి. అసహ్యంతో భార్య యిస్తే తను తీసుకుంటాడా?

"మరైతే నువ్వుకూడా పెందరాళే తెములు" అన్నాడు భార్యతో అతను.

రామసీత మాట్లాడలేదు.

"నిన్నే—"

ఆమె తలెత్తింది.

"నాటకానికి నువ్వు రావా?"

"అత్తయ్యకూడా వొస్తున్నారా?"

"ఏమో—"

"నేనూ, అత్తయ్య యింట్లో వుంటాం లెండి"

"నువ్వు రావాలి"

తను చేసే పనిని భార్య చూడాలి, సంతోషించాలి, తన్ను మెచ్చుకోవాలి, తనకు ఆమె ప్రోత్సాహం ఇవ్వాలని కోరుకోని మనిషి ఉంటాడా? ఆంజనేయులూ ఆ ఉద్దేశంతోనే అన్నాడు.

రామసీత మాట్లాడలేదు.

"నిన్నే—"

ఈసారి అతని గొంతుకలో ప్రేమ మోగింది. భర్తగనక దబాయించినట్టు అన్నాడుగానీ.

"నేను రాను"

"ఏం"

"రాను"

"ఛీ"

"ఏం మాటలండీ ఇవి? మొగుడు వేషాలు వేస్తుంటే పెళ్లాం వొచ్చి చూస్తుందీ? చూడొచ్చా?"

"నిక్షేపంగా చూడొచ్చు"

"దానికేం గానీండి. అందరూ పోతే-యిల్లు—"

"మాఅమ్మ వుంటుందిగా? యీమాటలకేంగానీ—నాన్చక, పెందరాళే తెములు"

"ఆవిణ్ణి ఒక్కత్తెనూ వుండమని పోవడం బాగుండదుగానీ, నామాట వినండి"

"పోరాదుటే—వాడు అంత ఇదిగా రమ్మంటుంటే—" అని అందుకుంది కనకమ్మ.

"నేను వెళ్లనండీ అత్తయ్యా"

రామసీతగొంతిక మారుతోంది. ఏడుపుకు దగ్గర్లోకి పడుతోంది.

"బాగానే ఉంది" అన్నాడు అతను.

"ఇంతేనమ్మా. ఆడముండలు ఎప్పుడూ ఇంతే. అన్నయ్యను వొదిన కాల్చుకుతినలా? ఎక్కడికిపోతై బుద్ధులూ" అంది కనకమ్మ. ఈ సంబంధం మేనరికం.

"మాఅమ్మేం సుకితేటిదీ, పడితేటిదీ కాదు - బుద్ధులు వొచ్చి నేను చెడిపోటానికి. ఆవిడేం వేలుపెట్టి వొంపించుకోలేదు. పరువుగానే ఉంది. ఇంతకూ ఆవిడేం నీకు పరాయిది కాదు. సాక్షాత్తూ అన్నపెళ్లాం" అంది రామసీత.

"ఆ. అన్నపెళ్లామే—మేనరికానికి వొప్పట్టాన వొప్పుకుందా మాతల్లి! అయినా ఇప్పుడవన్నీ ఎందుకు—?"

"అన్నీ అనేదన్నీ, ఎవరో అంటున్నట్టుండేదన్నీ. ఇప్పుడవేం నే తీసుకురాలేదు—"

రామసీత యీమాటలు ఇంచుమించుగా ఏడుస్తూనే అంది.

"నాకెందుకు, దానిష్టం, దాని మొగుడిష్టం" అని కనకమ్మ చక్కా పోయింది.

రామసీత అక్కడే నుంచునుంది. దానిష్టం, దాని మొగుడిష్టం, నాకెందుకు అనుకున్నది తను రాకపోతేనేం? వొచ్చి సప్త పితాళ్లకూ పెట్టకపోతేనేం? కడుపు భగ్గున మండింది. ఆనది మండి మాత్రం ఏంచేస్తుంది? తనవాళ్ళెవరూ లేనిచోట తాను నిలబడి వుండాలి, బతకాలి. తనవాళ్ళెవరూ లేకేం? అవటానికి మేనత్తా, మేనత్త కొడుకూనూ. అంతా తనవాళ్ళే. కోపలయింది గనుకా, పెళ్లామయింది గనకానూ యీమాటలన్నీనూ. మేనత్తగదా అని ఏమన్నా వెనకేసుకొచ్చిందా? పెట్టవలసిన మంగళహారతులన్నీ పెట్టివిడిచింది కాని.

ఆంజనేయులుకు ఏమీ తోచలేదు. 'సరే' అన్నాడు బరువుగా. బైటికి వెళ్లాడు. తీసిన చీరలూ, అవి మంచమ్మీదే ఉన్నవి.

ఆంజనేయులూ, స్నేహితులూ వొచ్చారు. నాటకాలమాటలే చెప్పుకుంటూ భోంచేశారు. భోజనాలు కాంగానే ఆంజనేయులు గదిలోకి వెళ్లాడు. మంచంమీద రామసీత పడుకునిఉంది. లోపల్లోపల ఏడుస్తోంది.

"నిన్నే—"

తలెత్తలేదు ఆమె. బయట విశిగా చూపించే వినయం గదిలో చూపబడదు.

"నామాట వినవూ"

"నే విన్నండీ!"

"నిజం?"

"............"

"రావూ నాటకానికి?"

"................"

"నీఖర్మ—"

ఆంజనేయులు వెళ్లిపోబోతున్నట్లు నటించాడు.

"ఖర్మే మరి—"

ఆంజనేయులు ఇక ఆగలేకపోయాడు. బైట స్నేహితులు కాచుకున్నారు. వాళ్లేమనుకుంటారు?

"లే. అన్నం తిను. లే"

రామసీత అల్లాగే పడుకునుంది. ఆంజనేయులు నుంచునే ఉన్నాడు. గదిలో నుంచోటం చిరాకుగా ఉంది. భార్య పడుకుని మాట్లాడుతుంటే తాను నుంచుని మాట్లాడ్డం పురుషుడికి కోపరదా? ఎప్పుడు? తను కోరుకున్నప్పుడు. విశాలమానవత్వం చిలకల్లే వొచ్చి వాలుతుంటే, అప్పుడు. కోపంవచ్చినప్పుడో—ఎందుకూ ఆమాట?

రామసీత కాలిపట్టాగొలుసు మెరుస్తోంది. చీలమండలకు పైగా ఆమెకాలు పట్టుకుని కాలు ఎత్తి వొదిలేశాడు. కస్సుమంది. మంచం పట్టెకు కొట్టుకుంది. రామసీత ఏడుపు దిగమింగలేకపోతోంది.

"లే—అన్నం తినూ"

రామసీత మాట్లాడలేదు.

"ఆంజనేలూ!"

—వాకిట్లో స్నేహితులు. ఆంజనేయులు చీరెలూ, అవీ తీసుకున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ మొహంచాటుచేసుకున్న భార్యకేసి చూడకుండానే వెళ్లిపోయాడు.

రామసీత ఆరాత్రి అన్నం తినలేదు. అలిగి పస్తుపడుకుంది. "ఇంతమంది తినగా లేంది నీవు రావేమే" అని అత్తగారు అనిపోయింది. "స్థానబలిమికాని తన బల్మికాదయా" అన్న చిన్నప్పుడు చదువుకొన్న పద్యం గుర్తుకొచ్చింది తెల్లారి రామసీతకు.

ఆరాత్రి నాటకం అభాసు అయింది. గొడ్లపాకను హాలు చేశారు. ఆడారు. ఆంజనేయులు బలవంతంమీద ఆడిస్తున్నాడు ఈ నాటకాలు. అతనికి నాటకాలు ఆడించడం సరదా. రంగేసుకుని తనుండటం, మాట్లాట్టం, పోజులుపెట్టటం ఇవన్నీ అతన్ని ఉత్సాహపరుస్తవి. ఎప్పటికయినా స్థానం నరసింహారావంత కావాలని అతని ఉద్దేశం. ఆపల్లెటూళ్లోనే నలుగుర్నీ పోగుచేసి, నలుగుర్నీ రక్షించి నాటకాలు ఆడుతున్నాడు. మొదట్లోనే హంసపాదు. మొదటినాటకమే మట్టికొట్టుకుపోయింది.

ఆపాతనాటకాలే కావడం, వాటినైనా చక్కగా ఆడలేకపోవటం, రోజూ ప్రత్యక్షమయ్యేవాళ్లే కావటం, అన్నింటికన్నా పీటమీద అసహ్యం పెరగటం—ఇలాంటి కారణాలవల్ల అవి ఎక్కరావడంలేదు. అతను చిన్నప్పుడు బస్తీలో చదువుకున్నాడు. ఇతని చదువుల కోసం కాపరం బస్తీకెక్కింది. కొడుకు చదివి ప్రయోజకుడౌతాడన్న ఉబలాటం ఏతల్లి కుండదు? కనకమ్మకూ ఉంది. "వాడికేమే మహారాజు. తను సుబ్బరంగా ఇంత తింటాడు, నలుగురికీ పెట్టాడు. చాప చెడ్డా చదరకు లోటుండదు" అన్న ధీమా ఉండేది ఆవిడకు. ఇది కాస్త నాచుకునేదికూడా కాదు. నలుగురిలోనూ అనేసేది. నలుగురూ విని ఏమనుకుంటారో అని ఆమె అనుకునేది కాదు. భోంచేసి, టక్కున వక్కపలుకు కొరుకుతూ, కిరీటం సవరించుకుంటూ ఆవిడ ఈమాట అంటుంటే—ఆమెకు మహేంద్రపదవి కొరికినట్టుండేది.

ఆంజనేయులుకూ ఉండేది ఇది. పైగా తల్లికూడా అంటోంది. వొళ్లు వంచి చదవకపోతేనేం—తను పైకి కాగలడు. అయినా, వెధవచదువు. ఎప్పుడూ పుస్తకాలు రుబ్బటంమాత్రం-ఛీ! అతనికి చాతకాదు. ఒరిజినల్‌గా థింక్ చెయ్యాలి. అంతేగాని, రుబ్బి పరీక్షలు పాసుకావడం అంటే అతనికి నామర్దా. గేప్నేఫీ కట్టినందుకుగాను, అతను దాన్ని సార్థకపరచేవాడు. రోజూ ఫుట్‌బాలు ఆడో, మరేమన్నా చేసో దెబ్బతగిలించుకురావడమూ, ఐడోఫారం పట్టించుకోవడమూ పరిపాటి అయింది. మూడునాలుగేళ్లు చదువు గుంటపూలు పూసింది. 'చాపచెడ్డా చదరు' అన్న ధీమా పెరిగింది. చివరికి పేకాటలో మునిగి తేలి, ధూమయజ్ఞంలో నిష్ణాతుడై, రోగాలు తగలడంతేరువాయిగా మళ్లీ స్వగ్రామం చేరాడు. సైకిలు విప్పగలడు. మళ్లీ అతకగలడు. పేకాటలో మాంచి ఫామేదా. సప్తప్రహాతి చేసినట్లు ధూమయజ్ఞం చెయ్యగలడు.

స్వగ్రామం వొచ్చాక ఆంజనేయులుకో పాసవకార్యం జరిగింది. రామసీత కాపరానికి వొచ్చింది. మొదట్లో మేనమామ ఏమంటాడో అని అతను అనుకునేవాడు. కాని, పిల్లనిచ్చుకున్న తరువాత మేనమామ మామగారైనాడు. భూమ్మీద అల్లుళ్లు మామగార్లను గౌరవించటం అపురూపం. గనుక, అతనూ మామగారిని సమానఫాయాలో జమకట్టి భయభక్తుల్ని విడిచేసేవాడు. ఖుషీగా తిని తిరుగుతూండేవాడు. పొద్దుపోటానికి కబేలుచేస్తులూ, సాయంత్రం వేళ కొంచెం బ్యాట్‌మింటనూలో సరిపోయేది.

ఈపరిస్థితుల్లో రామసీత కాపరానికొచ్చింది.

తన అన్న తన మొగుణ్ణి తేలిగ్గా మాట్లాడుతూంటే రామసీతకు కొత్తలో గమత్తుగా ఉండేది. తరువాత్తరువాత అన్న అబద్ధాలాడుతున్నాడనుకునేది. చివరికి ఇంతఘోరకలి ఉండదనుకునేది. సహజంగా మొగుడి పక్షమే అయింది. తను మొగుడిపక్షం మాట్లాడ్డం బావుండదు గనుకా, సిగ్గు సహజంగా అలుముకుని ఉండేదిగనుకా

ఆమె పెదిమవిప్పి మాట్లాడేది కాదు. కాని, మనస్సు మాత్రం ముంగిసిపట్టే ఉండేది.

తీరా కాపరానికి వొచ్చాకచూస్తే ఇది. చీట్లపేక ఆడటంలో తన మొగుడు మునిగి తేలితుంటే ఆమెకు కష్టం వేసింది. ఇంట్లో పదిమంది తుమ్మాయిజగ్గాయిగాళ్లను చేర్చి వాళ్లతో అంతూ పొంతూ లేకుండా పడితుంటే ఆమెమనస్సు ఒకలాగయింది. సొంత మేనత్త అయినగూడా, అత్తగారు అల్లా ఉంటే ఇంకా కొట్టినట్టు అయింది. చివరికి నాటకాల్లో వేషం వేస్తానని మొగుడు అన్న రోజున తల తీసేసినట్టు అయింది. అన్నగారు అన్న మాటల్లో ఒక్కటీ అబద్ధంలేదు. తెలీక తను అన్నను నానామాటలూ అంది.

నాటకం పూర్తయినమర్నాడు ఆంజనేయులు తనలోతాను లేడు. ఓడిపోయిన బక్క కోపం అతనికి వొచ్చింది. అంతుచూడ్దామని నిశ్చయించుకున్నాడు. ఏమయినా సరే-యిందులోనే తను పైకి కావాలి. యిదేం తక్కువదా? తెలీక తన భార్య వొద్దంటుంది కాని. పెనుమంకుపట్టు పట్టుకూర్చుని నాటకానికి రాలేదుగాని, వొచ్చివుంటే అదీ తనతో కలిసేదే.

ఓ నిద్ర తీసి లేచాక, రామసీత దగ్గిరికి వొచ్చింది. నల్లని చీర కట్టుకుంది. తెల్లని మల్లురవిక తొడుక్కుంది. పచ్చని మనిషేమో-ఎంతో అందంగా ఉంది. రాత్రి తిండి మాన్చుకుని ఏడ్చేడ్చి ఉందేమో — నిద్రలేకుండా ఉందేమో — మొహం బరువుగా ఉంది. వొచ్చి మొగుడిమంచందగ్గర కింద కూచుంది. ఆంజనేయులు కళ్లతో తనివితీరా చూస్తున్నాడు భార్యను. కాస్త వలిగిన పువ్వులాగుంది ఆమె.

"తింటానికి ఏమన్నా తేనా?"

రామసీత ఎంతో ముద్దుగా అడిగింది. ఆంజనేయులు ఈ ముద్దును అర్థంచేసుకున్నాడు. సంతోషంతో అతని కళ్లు సగం మూతలుపడ్డై.

"ఏమున్నై?" అన్నాడు.

"అటుకులు పాలల్లో వేశా"

ఆంజనేయులు కళ్లు ఎగరేశాడు. 'తే' అన్నాడు.

హంసనడిచినట్టు నెమ్మదిగా నడిచివెళ్లింది రామసీత. తీసు కొచ్చింది. మంచానికి ఆనుకుని కింద కూచుంది.

"దా" అన్నాడు ఆంజనేయులు.

రామసీత నవ్వింది. నెమ్మదిగా అటుకుల్ని కాస్తకాస్త తీసి అతని నోట్లో పెట్టింది. ఆంజనేయులు ఉద్దుకుడుచుకున్నాడు. అటుకుల గిన్నె తను తీసుకున్నాడు. నిశ్శబ్దంగా, నెమ్మదిగా తిన్నాడు. ముద్దుకైనా కాస్త తనకు పెట్తాడనుకుంది రామసీత. ఒక్కసారి చురుగ్గా చూచింది. ఆంజనేయులు అదేమీ గమనించనే లేదు. నెమ్మదిగా సిగిరెట్టు తీసి అంటించాడు.

"ఇది మానగూడదుటండీ!"

ఆంజనేయులు నవ్వాడు. 'పిచ్చిబొండా, నీమాట నేను వింటా ననే' అన్నట్టు అర్థమయింది ఆమెకు. నెమ్మదిగా ఖాళీగిన్నె తీసుకుని లోపలికి వెళ్లింది.

౨

"నేను వినయపూర్వకంగా రొట్టెకోసం వేడుకున్నా. నా కురాయి లభించింది. ఆంగ్లజాతి బలప్రయోగానికిమాత్రమే లొంగుతుంది. భారతజాతికి తెలిసిన ప్రజాశాంతి ఒక్కటే. అది పెద్దశైగు. భారతదేశం ఒక పెద్దకారాగృహం. నే నీబ్రిటిషుశాసనాన్ని ధిక్కరిస్తాను. వైస్రాయి కోరే శాంతి విసుగుపుట్టించే శాంతి. ఆ నిర్బంధ శాంతిమూలంగా భారతజాతి ఊపిరాడుట లేదు" అని గాంధీజీ వ్రాశారు.

దండీయాత్ర తప్పనిసరి అయింది. తనవెంట వచ్చే పాదచారులతో దండియాత్ర సాగింది.

దండిప్రస్థానానికి ప్రజాసముద్రం తరంగితమైంది. కథలు కథలుగా, గాథలుగా, బోధలుగా ఉప్పుసత్యాగ్రహం ప్రజల్ని ఉవ్వెత్తుకెత్తింది. మట్టిలోంచి మనుషులు లేచారు. ఆసేతుశీతాచలం గాంధీగారికేసి చూచింది.

ఊరూరా సభలు జరిగై. స్త్రీలు, పురుషులు, పసిబిడ్డ బాలాదీ కదిలారు. తఖీలీలు వడుకుతూనే సభలకు వొచ్చేవారు. లాఠీ దెబ్బలు తిన్నారు. "స్వరాజ్యం కావాలా? ఐతే ఇదుగో లాఠీ" అని పోలీసులు ప్రజల్ని పలకరించేవారు. స్త్రీలు, పురుషులు ఉద్యమంలో కల్లారు. ఉప్పు తెచ్చారు. తాళ్లుకొట్టారు. పికెటింగ్ చేశారు. అరెస్టయ్యారు. జైళ్లకెళ్లారు. భారతభూమిలో దాదాపు డెబ్బయ్యయిదు వేలమంది శ్రీకృష్ణజన్మస్థానాన్ని అలంకరించారు. తిరిగి వొచ్చారు. ఉప్పుసత్యాగ్రహంతో దేశజీవనంలోనే మార్పు వొచ్చింది.

గాంధీజీ హరిజనులకోసం ఉద్యమించాడు. అవీరోజులు.

రామసీతకు గర్భం వొచ్చింది. కడుపుతో ఉంటే కాకైనా అందంగా వుంటుందంటారు. రామసీత అసలే అందగత్తె ఏమో మరింత అందంగా ఉంది. ఉన్న కాసిని నగలూ తగ్గించింది. ముక్కులూ, చెవులూ, మెడా మరీ బోసిపోకుండా అత్యవసరమైన వొస్తువులు మాత్రం ఉంచుకుంది.

ఆంజనేయులులోనూ మార్పు వొచ్చింది. అతను రాటమొకటి ఇంటికి తెచ్చాడు. రోజూ తెలుగుపేపరు తెప్పిస్తున్నాడు. క్రాపింగు తీయించాడు. పేటకుపోయి ఖద్దరుబట్టలూ, చీరలూ, గుడ్డలూ తెచ్చాడు. పొద్దున్నే చద్దన్నం తిని రాటంముందు కూచుంటాడు. మధ్యాహ్నం నిద్రపోయి లేచి మళ్లీ దానిముందే కూచుంటాడు.

"ఈబండచీరలు నేను కట్టుకోలేనంది రామసీత. వీల్లేదన్నాడు ఆంజనేయులు. "కడుపుతో ఉన్న పిల్ల ఎల్లా కట్టుందనుకున్నావురా అవీ" అని కనకమ్మ అంది. అతను అక్కడితో ఆప్రయత్నం వొదులుకున్నాడు. రామసీత ఖద్దరు చీరల్ని దుప్పట్లుగా చేసింది.

ఇంట్లో శాంతివాతావరణం వొస్తోంది. అప్పుడప్పుడు పేపర్లో జరిగిన విషయాలు ఆమెకు చెప్తూండేవాడు. రామసీత అంతా విని ఊరుకునేది. నమ్మేదికాదు. కాని మొగుడి గొంతికలో నిబ్బరం, నిశ్చలత్వం చూచి నిజమే కాబోలు అనుకునేది.

ఆంజనేయులు రాటం వొడుకుతాడు. మాలమాదిగల్ని చూచి దూరంగా తప్పుకోడు. వాళ్లను ఊరతిట్లు తిట్టడు. మనిషి మారుతున్నాడు. చాటుగా వోనాడు "వాళ్లను అల్లా పూసుకుతిరగొచ్చా" అనడిగింది మొగుణ్ణి రామసీత.

"ఏం, వాళ్లుమాత్రం మనుషులు కారూ?"

"మనుషులు కాదన్నానా, వాళ్లను ముట్టుకోగూడదుగా"

"అవన్నీ అబద్ధాలు. గాంధీగారు ఏం చెప్పారు?"

"ఆపఠంలోఉన్న ఆయనేనా" అంది. దరిద్రనారాయణుని పటందగ్గిరికి వెళ్లింది. నిదానంగా చూచింది. అత్తగారి దగ్గిరికి వెళ్లింది.

"ఏమత్తయ్యా" అన్నది.

"నాకేం తెలుస్తుందే" అన్నది ఆమె. ఆమెకూ కొడుకు ఇల్లా కావడం ఇష్టం లేదు. కాని, ఎవరేమన్నా వినేస్థితిలో లేడు. పైగా ఆమెది కొడుకు ఏంచేస్తే అదే పదివేలు అనే మతం.

రామసీత చాలాసేపు నిదానంగా ఆలోచించింది. అప్పటి నుంచీ పాలేరుకుర్రాళ్లను, చాకలిదాన్ని ఎవర్నీ కోప్పట్టం, కసరటం మానుకుంది. రామసీత ముభావంగా వుండటం ఎక్కువయింది. బహు కొద్దిగా మాట్లాడుతుంది.

ఆంజనేయులు హరిజనుల్ని గుళ్లల్లోకి రానివ్వాలని నలుగురితో అనడం ప్రారంభించాడు. నలుగురూ తలోమాటా అన్నారు. నలుగురైదుగురు "చేశావులే నిర్వాకం, కాస్త కట్టిపెట్టు" అని సలహా ఇచ్చి చక్కాపోయారు. యాదవమూసలం పుట్టున్నదన్నాడు శాస్త్రుల్లగారు. ఆంజనేయులు విడిచిపెట్టలేదు. భగవద్గీత తెచ్చాడు. చూపించాడు. శాస్త్రుల్లగారేమన్నారంటే—"ఇదంతా నిజమే. కాని ఈ యుగంలో మాటకాదిది" అన్నారు. బహునెమ్మదిగానే అన్నారు. "ఐతే ఎందుకిది" అని పేన్నెట్టికొట్టాడు పుస్తకాన్ని ఆంజనేయులు. దాంతో శాస్త్రుల్లగారు చక్కాపోయారు.

"పెద్దవాడితో నీకెందుకురా" అంటూ కనకమ్మ వొచ్చింది.

"పెద్దతనం దక్కించుకోంటేనే పెద్దతనం నిలుస్తుంది" అన్నాడు ఆంజనేయులు.

"బిడ్డా, పాపా కలవాళ్లం. భగవద్గీతలు పేన్నెట్టికొట్టొచ్చా" అన్నది ముసిలావిడ.

రామసీత కడుపుతోన్నప్పటినుంచీ యింట్లోతొట్టిమంచం వేసినట్టుగానే అనుకుంటోంది ఆవిడ. ఆవిడ ఈమాట అన్నప్పుడు రామసీతకు మామూలుగా వొచ్చే సంతోషపు నవ్వు రాలేదు. ఏమవుతుందో అనుకుంది. ఆంజనేయులు శాంతించి మళ్లీ రాటందగ్గిరికి వెళ్లాడు. పది పోసులన్నా తియ్యలేకపోయాడు. ఆకు తీసుకొచ్చాడు. ఎనభైపోగులూ పోసి ముడివేస్తూకూచున్నాడు. కనకమ్మ పక్కయింటికి పెత్తనానికి వెళ్లింది. రామసీత వొచ్చి పక్కనే కూచుంది. ఆంజనేయులు తలెత్తి చూచాడు.

"వాళ్లను గుళ్లల్లోకి రానివ్వాలా?" అంది.

"వాళ్లకుమాత్రం దేవుడు కాడూ"

"రానిస్తే విగ్రహం మైలపడిపోదూ"

"మనిషి వొస్తే విగ్రహం మైలపడుతుందంటే పిచ్చిదానా! యివన్నీ మనం పెట్టుకున్న అడ్డంకులు. మనుషులందరూ వొకటే, అందరికీ అన్నీ వీల్లూ ఉండాలి." అన్నాడు.

రామసీత నెమ్మదిగా కూచుంది. ఆలోచిస్తూకూచుంది. నిజమే. కష్టం, సుఖం అందరికీ ఒకటే.

"ఐతే అందరూ గుళ్లోకి పోవచ్చా"

"ఆ."

చిలప పూర్తిఅయింది. నెమ్మదిగా ఆసునుంచి చిలపతీశాడు. బరువుగా నిట్టూర్పు విడిచాడు. "నేనొకటి చెప్తా వినవే—మనం పోవొచ్చుగదా గుళ్లల్లోకి? రోజూ పోతున్నాముటే? మనం పోం; పోతానన్నవాళ్లనీ పోనీం" అన్నాడతను.

"పోకేం, పోతున్నాంగా ముక్కోటికి"

"ముక్కోటే శివరాత్రేనా! మిగతారోజుల్లో...?" నవ్వాడతను. లేచాడు.

రామసీతా లేచింది. బుడ్లల్లో చమురు పొయ్యాలి. సందె కసువు వూడ్వాలి. ఇప్పటినుంచీ ఆవిడే అన్నిపనులూ చేస్తే బాగుండదు. ఆమె నెమ్మదిగా కిరసనాయిల్ డబ్బాదగ్గిర కూచుని బుడ్లల్లో చమురు పోస్తూ ఆలోచించుకుంటోంది. "మనం వెళ్లొచ్చుగదా గుళ్లల్లోకి? రోజూ వెళుతున్నాముటే—" అన్నమాట రామసీత చెవుల్లో మోగుతోంది. మనం ఎందుకు వెళ్లం అనుకుంది. బద్ధకం. ఒకరికైతే బద్ధకం, ఇద్దరికైతే బద్ధకంగాని, అందరికీ బద్ధకమేనా? బుడ్లల్లో చమురు పోయడం అయింది. నెమ్మదిగా సందెకసవు వూడ్చింది. ముగ్గుకర్ర ఆడించింది. పొద్దుటిముగ్గులు అన్నీ చెరగవు. యింట్లో పిల్లలు ఉంటే చెరుగుతై! పాపాయి వొస్తే ముగ్గులు చెరుగుతై అనుకుంది. పాపాయి అనగానే వొళ్లు ఝల్లుమంది. నవ్వుకుంది.

ఇకనుంచీ శుక్రవారం శుక్రవారం అమ్మవారి గుళ్లోకి వెళ్లాలి. అమ్మవారికి పసుపూ, కుంకుం ఇచ్చిరావాలి అనుకుంది. వెళితే ఇది వరకునించే వెళ్లాలిసింది. పాపాయి పుట్టేశాక యింకేం వీలవుతుంది? అప్పుడు పొద్దస్తమానమూ వాడి పనితోటే సరిపోతుంది.

కనకమ్మ వొచ్చింది. పండగనవు పూసి ముగ్గులు వేసిఉంది. తను చేస్తుందిగా. నెలలు వొస్తున్నాయిగదా, ఏం అంత తను చెయ్యకపోతే?"అంత తొందరేమొచ్చిందమ్మా. రానా, చెయ్యనా?" అంది. రామసీత తలెత్తిచూచింది.

"శుక్రవారం శుక్రవారం గుళ్లో కెళదామా అత్తయ్యా" అంది.

"వెళ్లినట్టే ఉంది. అంతమాత్రం గీతకూడానా? మన బోటి వాళ్లకు కొంపే కైలాసం." రామసీత యీమాటా శ్రద్ధగా వింది. సున్నిపిండీ, తువ్వాలూ తీసుకుని నూతిదగ్గిరికి వెళ్లింది. మొహం కడుక్కుందామని నూతిదగ్గిరికి వెళ్లగానే కొంటిమీద నీళ్లోసుకో బుద్ధిపుట్టింది. చిన్నప్పుడు తను నీళ్లంటేచాలు, ఎగపడేది. "కోజాతల్లారా స్నానంచేటే" అని తల్లి ఎప్పుడూ కోప్పడేది. అయినా తను ఆగేదికాదు. నవ్వు వొచ్చింది. ఇంట్లోకి వొచ్చింది. పాతచీర కట్టుకుని నూతిదగ్గిరికి పోయింది. నీళ్లు పోసుకుంటూంటే అత్తగారు అన్నమాట నెమరుకొచ్చింది. "అంతమాత్రం గీతకూడానా? మన బోటివాళ్లకు కొంపే కైలాసం" రెక్కలు విరుచుకు నేవాళ్లు,దరిద్రులు గుళ్లల్లోకి ఎక్కడ పోతూఉంటారూ? వాళ్లకు ఇల్లే కైలాసం. వాళ్లు, పాపం, లేకపోతే సున్ని ప్రద్దానికీ మారాజులని ఎంచు కుంటారు? చాకల్ది మన గుడ్డలు వుతుకుతుంది. మనం దాని గుడ్డలు ఉతుకుతామా? మన గుడ్డలు మనం ఉతుక్కుంటాం. తను చేనుతో చాలకేగా, వాళ్లన్న కృష్ణమూర్తి యింకోళ్ల పొలంగూడా కవులు పుచ్చుకుంది. చాలితే పుచ్చుకుంటాడా? అవును. అన్నయ్య ఇదే అన్నాడు. "గుడీ గిడీ మీరు పోండి. నేను చేలోకి పోతా. నాకు చేనే దేముడు" అంటాడు అన్నయ్య.

స్నానం చేసి వొళ్లు తుడుచుకుంటూంటే మరొకటి తట్టింది. "అసలు గుళ్లోకి వెళ్లకపోతేనేం? జరగదా? ఇప్పుడుమాత్రం అందరూ వెళుతున్నారా? దేముడు ఏమన్నా చేస్తే—? ఏమిటోనమ్మా. నా కెందుకొచ్చింది?" అనుకుంది మళ్లీ. ఉతికిన చీరా, రవికాతో వచ్చి మిఠాయిపొట్లంలాగ కూచుంది. తోచలేదు. లేచి గదిలోకి వెళ్లింది. దీపం వెలిగించింది. మళ్లీ వొచ్చి కూచుంది. అత్తగారు అన్నంగిన్నె పొయిమీద వేసింది. వెలుతురూ, చీకటీ పోట్లాడు కుంటూన్నై. జొడ్డింకలు తప్పుకు తప్పుకు పారిపోతున్నయి. పొయిలో మంటలు గమ్మత్తుగా లేస్తున్నై. అగ్నిహోత్రుడికీ, ఆలోచనలకూ సయోధ్యక్కల్లే ఉంది. జ్వాలలు ఆడుతూన్న కొద్దీ ఆలోచనలూ ఆడుతై. తను, తన యిల్లు, తన వంశం, తన రక్తం పవిత్రంగా చూచే దేవాలయం మైలపడుతూందన్న ఆలోచన వొచ్చి, ఆమెను అతలాకుతలం చేస్తోంది. శకరకాలుగా ఆలోచన పోతోంది. ఎవరుకళ్లె పెళ్లాడినట్టు మనస్సుకళ్లె పెళ్లాడుతోంది. వాళ్లు కురీ అసహ్యంగా ఉంటారు. మురికిపోడుతూ ఉంటారు. ఖదీ చీరలు లేకపోతే తనూ మురికిపోడుతూనే ఉంటుంది. ఈ మాట తోచగానే ఆమెమనస్సు జలదరించింది. యిహ ఇది ఆలోచించుకోగూడ దనుకుంది.

అప్పుడ్డవశాత్తూ పక్కయింటివాళ్ల పిల్లాడు రాము డొచ్చాడు. పిచ్చివాడు! నాటకానికి తీసి కెళ్లమని అడిగినవాడు మళ్లీ ఆమాటే లేదు. ఇంట్లో పెద్దవాళ్లు కోప్పడ్డారో ఏమో. ఎప్పుడన్నా వొస్తాడు. రాటుం భర్రుమని తిప్పిపోతాడు.

"ఏరో రాముడూ, రా"

రాముడు వొచ్చాడు. కాస్సేపన్నా కూచోలేదు. తుర్రుమని లేచిపోయాడు. ఎందు కొచ్చినట్టు, ఎందుకు పోయినట్టు? పిల్లలంటే. వాళ్ల ఇష్టం. పిచ్చికలల్లే వాలి, పోతారు. కొస్త అల్లరి చేస్తారు సరదాగా ఉంటే.

అన్నం ఉమ్మగిలింది. ఆంజనేయులు వొచ్చాడు. భార్యా భర్త లిద్దరూ ఏకపంక్తిన భోంచేశారు. గర్భిణి ఐనప్పటినుంచీ రామసీత మొగుడితోపాటే అన్నానికి కూచుంటోంది. అన్నం తిని గదిలోకి వెళ్లింది. నిద్రపట్టలేదు. సాయంత్రం వొచ్చిన పేపరు చదువు కుంటున్నాడు ఆంజనేయులు.

"ఏమండీ, గుళ్లల్లోకి వెళ్లకపోతే నేమండీ!"

"ఏం వెళ్లకపోతే—" అన్నాడు పరధ్యానంగా.

"ఐతే మాల—కాదు, హరిజనులకు గుళ్లు తెరవకపోతేనేం?"

"అమ్మబాబోయ్, అది చేసితీరాలి"

"దరిద్రులకు అన్నం,బట్టా తృప్తిగావొచ్చేట్టుచేస్తే చాలదూ?"

ఆంజనేయులు ఇది ఆలోచించలేదు. భార్య కొత్తగా మాట్లాడుతూం దనిపించింది. అతనేమీ సమాధానం చెప్పలేదు. ప్రోత్సాహకరంగా మాట్లాడకపోబట్టే, కాస్సేపు చూచి రామసీత అటు తిరిగి పడుకుంది.

రాత్రి అంతా నిద్రపట్టలేదు. తెల్లారింది. అన్నా, వొదినా వొచ్చారు. చలిమిడీ అవీ తెచ్చారు. పురిటికి తనను తీసుకెళ్లటానికి వొచ్చారు. అన్ననూ, వొదిన్నీ చూడగానే రామసీత మొహంచాటంతయింది. విచ్చిన పెద్దచామంతిపూవులాగుంది ఆమె.

వొదినగారూ, పక్కయింటిఆవిడా గూడిదం నలుగురికీ పంచారు. ప్రయాణం. తల్లి "నాదేముంది నాయనా, మీయిష్టం, మీ బావయిష్టం" అంది. కొడుకు "నాదేముంది, మీ చెల్లెలిష్టం, మీ మేనత్తయిష్టం" అన్నాడు. వొచ్చిందాలతో ఆరోజుకి ప్రయాణం చెడింది.

"ఏమండీ."

ఆంజనేయులు తలెత్తిచూచాడు.

"మిమ్మల్నే–"

"ఏం"

"మిమ్మల్ని విడిచి వెళ్ళటమంటే ఏమిటోగా ఉందండీ!" అంది రామసీత.

ఆంజనేయులు నవ్వాడు. ఆనవ్వు గమ్మత్తుగా ఉంది.

"ఏం నవ్వుతారు" అంది.

"లోపల వెళ్ళాలనేమో తొందరనూ, పైకి పైపై ప్రేమలూనూ"

రామసీతమనస్సు చివుక్కుమంది. తను ఎంత ప్రేమగా అడిగిందో అంత ప్రేమగా అతను ఉంటే–? అయ్యో రాత! స్త్రీ పురుషులు కోరుకునేది ఇదే. సామాన్యంగా లభ్యంకానిదీ ఇదే. వెళుతూవెళుతూనూ కూడా నొప్పితోటే వెళ్ళాలని రాసుందికాబోలు అనుకుంది. వొచ్చిన ఊహను ఆమె మింగింది.

"ఈమాటలకేంగానీండి—"

"అంత పచ్చిఅబద్ధాలా?"

రామసీత ఏమీ అనలేదు. మరీకే దమ్మతో లేదన్నట్టు ఊరుకుంది. ప్రేమ ఉంటే ఏమన్నా అనవొచ్చు, పడవొచ్చుగాని, ప్రేమ కరువైనచోట 'ఆఁ' అంటం అన్యాయం; 'నారాయణా' బూతుమాటే.

"ఏమండీ ఊరుబడైనప్పుడు నన్ను చూట్టానికి రారూ!" అంది మళ్ళీ.

"ఎప్పుడూ నాకు ఊరుబడేగా!"

లాభం లేదు. ఎత్తు ముదురుతోంది. రామసీత కట్టిపెట్టింది. ఆరాత్రి తాను ఎంతో మాట్లాడుదామనుకుంది. ఎన్నెన్నో సంగతులు చెబ్దామనుకుంది. లేవబోయిన అల అక్కడే అణగారినట్టు అయింది. తెల్లారగట్ట రామసీత ప్రయాణం అయింది. వెళుతూ వెళుతూ గాంధీజీబొమ్మదగ్గిర ఆగింది. ఆబొమ్మను చూస్తుంటే ఆమెకు ఏదో శాంతంగా ఉంటుంది. దరిద్రనారాయణుడి బొమ్మను తీసుకెళ్దామనుకుంది. తరువాత వేరేకొనుక్కోనూవచ్చు అని అనుకుంది. నిద్రపోతోన్న మొగుణ్ణి లేపి చెప్పింది. అతను నిద్రమత్తులోనే తల ఊపాడు. అత్తగారితో చెప్పింది. "సుఖంగా వెళ్ళి లాభంగా రాఅమ్మా" అంది. మళ్ళీ గదిలోకి వొచ్చింది. మొగుడు లేస్తాడనీ, కొంతదూరం వొస్తాడనీ అనుకున్నదిది రాత్రే పోయింది. మళ్ళీ చెప్పిరావటానికి వెళ్ళింది. లేపింది.

"వెళుతున్నా" అంది ముద్దుగా.

అతను తలెత్తి 'సరే' అన్నాడు. ఆమె చిన్నపుచ్చుకుంది. నవ్వుతూ సంతోషంగా పుట్టింటికి వెళ్ళేఇది తనకు లేదు అనుకుంది.

"గాంధీగారి పటం తీసికెళ్ళనా?" అంది. లేచి "వొద్దు. నాకు ఉండాలి" అంటూ దనుకుంది.

"ఊఁ" అన్నాడు మొగుడు.

పటందగ్గిరికి వెళ్ళింది. "ఇక్కడే ఉండనీ, వేరేకొనుక్కుంటాలే" అనుకుంది. బండీ ఎక్కింది. బండి కదిలింది.

"అత్త వెళుతోంది, అత్త వెళుతోంది." అంటూ రాముడు, పక్కయింటివారి అబ్బాయి బండివెంట నాలుగడుగులు వొచ్చాడు.

## 3

రామసీత చురుకైన పిల్ల. కిలకిలా నవ్వుతుంది. అన్యాయం అని తోస్తే ఎంత వాళ్ళనయినా ఉన్నమాట అనేస్తుంది. ఎంత ఆకాశం విరిగి మీదపడుతూన్నా లెక్కచెయ్యదు. కలుపుగోట్టుతనంగా ఉంటుంది. అలాంటిది బండీ కదిలాకకూడా స్తబ్ధగా ఉండేప్పటికి వొదినగారు ఆశ్చర్యపడింది.

"అత్తారింట్లో చాలా మారావమ్మా!" అన్నదామె రామసీతను.

రామసీత నవ్వింది.

"నేను గ్నాపకం ఉన్నానటమ్మా!" అన్నాడు బండీ తోల్తోంచి నాంచారి.

"ఎందుకు జ్ఞాపకం ఉండవ్రా" అంది. నాలిక్కొరుక్కుంది. "అందరూ జ్ఞాపకంఉంటారు." అంది. నాంచారయ్య చిన్నప్పుడు రామసీతను ఎత్తుకుమోశాడు. వోరోజున వాడిమీద తనకు కోపం వొచ్చింది. వాణ్ణి తిట్టింది. కొట్టింది. గిల్లింది. నెత్తురొచ్చింది. "అమ్మగారితో చెప్పనా" అన్నాడు వాడు. రామసీత తెల్లపోయింది తల్లితో చెప్తాననగానే. నెత్తురు కళ్ళమాచేసరికి భయం వేసింది. చప్పున ఏడ్చింది. దెబ్బతిన్నవాడే సముదాయించాడు.

"కోడెదూడ పెద్దదయిందా?" అంది.

"ఆఁ"

"ఏరా అన్నయ్యా—" అంది. అన్న సందేహించి. మళ్ళీ ఆగింది.

"ఏమిటే—" అన్నాడు అన్న.

"అబ్బే. ఏంలేదు" అంది.

అన్నా, వొదినా మొహాలుమొహాలు చూచుకున్నారు.

పుట్టింటికి చేరింది. "రామసీ తొచ్చింది, రామసీ తొచ్చింది" అని నలుగు రమ్మలక్కలూ చేరారు.

"అల్లా ఉన్నావేమే మాతల్లీ—" అన్నారు. "ప్రయాణం కాదుటే" అని వాళ్ళకువాళ్ళే జవాబుచెప్పుకున్నారు. వెళ్ళిపోయారు.

రామసీత వొచ్చినప్పటినుంచీ ముభావంగా ఉండబోతుంది. కట్టతెగినట్టు గబగబా మాట్లాడుతుంది. అణచుకోబోతోంది తనను. అణచుకుంటోంది కూడాను. పనిపాటలవాళ్ళను ఏమన్నా మాట అనదు. అననీదు.

చాకలిది రోజూవారీ ఉతుక్కు వొచ్చింది. "ఏమే—" అని వొదిన పిలిచింది. వెంటనే వెళ్ళింది రామసీత. "వాళ్ళా మనలాంటి

వాళ్లే వొదినా. ఏందు కలా అంటావ్—" అంది. వొదినా, చాకలిదీ ఇద్దరూ వెళ్లిపోయారు.

చాకలిది బట్టలు తీసుకువెళ్లిపోయాక వొదినగారు దొడ్లోపడి దుంఖిస్తోంది.

"ఏమన్నావే ఏమిటే?" అని తల్లి అంది.

"ఏమీ అనలేదే—"

"ఏమో మరి-దొడ్లో పడి ఏడుస్కుంటోంది" అంది ఆమె.

రామసీత వేరుగా దొడ్లోకి వెళ్లింది.

"ఏమమ్మా, నేనేమన్నాననీ—" అంది.

"నేనుమాత్రం ఏమన్నానమ్మా."

"వాళ్లూ మనలాంటివాళ్లు అన్నందుకేనా ఇంత ఇదీనూ" అంది రామసీత.

"దాంకుంప తెగిరి! దాన్ని ముందుపెట్టుకుని అంటేగాని తోచలేదుటమ్మా"

"........................"

"ఇక మళ్లీ అనగలమా, అలుసుకామటమ్మా, నువ్వు చెప్పు"

"మాట అనగా లేంది, అలుసౌతామనేనా అమ్మా" అంది రామసీత.

"పురెక్కించు తల్లీ. ఇప్పటికే వాళ్ల కళ్లు నెత్తిమీదికొచ్చై. నీలాంటివాళ్లుగూడా కలిస్తే—" అందామె.

"మడికట్టుకుని మంచినీళ్లు తెచ్చుకుంటున్నానరే—కాస్త దూరంగా పొండర్రా అంటే-అమ్మో, వాళ్లు వింటారా? ఎదురు నవ్వుతారు. నీ దారిన నీవు పో అమ్మా అంటారు." అంది వొదిన, వాళ్ల పల్లదనం చూచావా అన్నట్టు.

"పాపం" అంది రామసీత.

ఈ ఇది సాయంత్రందాకా నలుగుతూపడింది. పెద్దలు నలుగురూ అల్లా అనగూడదని రామసీతనే కోప్పడ్డారు. అందరికీ తలో మాటా అప్పచెప్పాలని అనుకోకపోలేదుగాని, నాల్రోజులుండిపోయే దాన్ని నా కెందుకని ఊరుకుంది రామసీత.

తానుమాత్రం అందర్నీ గౌరవంగా పిలుస్తుంది. చేతిలో ఏమున్నా, వాళ్లుంటే, వాళ్లకూ్కడా పెట్టి తింటుంది. దీని కిదో పిచ్చి అని పుట్టింటివా రూరుకోలేదు. మాతులూ ముక్కులూ విరుచుకుంటూనే ఉండేవారు.

పాలేళ్లు, చాకలిది మొదలయినవాళ్లు ఆమెతో కష్టాలూ సుఖాలూ వెళ్లబుచ్చుకునేవాళ్లు. చిరుగులచీరతో పాలేరువాంచారి కూతురు వొస్తే తన చీరల్లో కాస్త గట్టిది చూచి ఇచ్చింది. నల్లరాయిలాంటి చీర వాళ్ల ఎదాన కొట్టిందని ఆరోజు మాటపడింది ఆమె. "ఇస్తే ఇచ్చావులే. మీరు గూడా ఇవ్వరాదూ" అంది.

క్రమక్రమంగా నెలలు నిండుతూన్నై. "నీ కెందుకు, నువ్వు కూచోవే" అన్నా, పనిలో కొచ్చేది. "కూరలు తరగడమైనా పనే చేస్తాను. ఊరికే కూచుని తింటం తప్పుకాదూ" అనేది. ఇంకా కాపరానికి పోని పిల్లలకు పూసలుకుట్టు నేర్పింది. పూలుతో పతాలు అల్లడం నేర్పింది. ముఖ్యంగా ప్రజ లందరూ మనలాంటివాళ్లే అంటుంది. చిన్నపిల్లలు మొదట్లో నవ్వారుగాని-తరువాత్తరువాత చెవొగ్గారు. "వాళ్లు ఏడిస్తే మనం బాగుపడం" అనేది.

మొగుడు చూట్టానికి రాలేదు. ఉత్తరమన్నా రాయలేదు.

వోసారి రమ్మని రాయిద్దామని ఆమె చాలా అనుకుంది. ఎటుపోయి ఎటు వొచ్చి వికటిస్తుందో అనీ అనుకుని ఊరుకుంది.

మొగుడు వొక్కసారన్నా వొచ్చి మనసారా మాట్లాడితే చాలా సంతోషించేది. నిజమే. కొన్ని ప్రాణులు సంతోషించటానికీ, సుఖపడటానికీ పుట్టవు. సుఖానికై వెంపరలాడుతై గాని, సుఖం అనేది దక్కదు. ఆరాటమే మిగులుతుంది.

అత్తారింటి కెళ్లక చదువుకోడం మూలపడింది. ఎప్పుడూ ఏదో ఇది మనస్సు నిండిఉండేది. దాంతో ఆమె కిందామీదా అవుతూండేది. ఇప్పుడామె మళ్లీ కాస్త చదువుధోరణిలోకి పడింది. నెమ్మదినెమ్మదిగా కూడపలుక్కుంటూ చదవడం మొదలెట్టింది.

మొగుడు ఉత్తరమ్మొక్క రాయడని తేల్చుకుంది.

తాను రాద్దామని నిశ్చయించుకుంది. తప్పేం లేదుగదా. మొగుడికి పెళ్లాం రాయడం తప్పా? ఉత్తరం ఎల్లా రాయాలో తోచలేదు. ఎలా ప్రారంభించాలో ఎంతసేపటికీ అంతుపట్టనేలేదు. ఎల్లాగో అల్లా నాలుగుబంతులు రాసింది. పాలేరుచేత పోస్టులో వేయించింది. ఎన్నాళ్లకూ సమాధానం రాలేదు. లాభంలే దనుకుంది.

రామసీత ప్రసవించింది. మొగపిల్లాడు. తల్లిపోలికే అంటే తల్లిపోలికే అన్నా రందరూ. తనకూ అల్లాగే ఉంది. ఐనా పెద్ద నెలలో గుడ్డును చూచి ఎలా పోలికలు చెప్పటం? పిల్లాణ్ణి చూస్తున్నకొద్దీ చూడబుద్ధిపుడుతోంది. ఆ చిట్టిముండ గుప్పిళ్లు బిగపడతాడు. వొళ్లు సాగదీసుకుంటాడు. బుల్లినోరుతో కళ్లుమూసుకుని ఏముటో చెబుతాడు. మొగపిల్లాడు పుట్టాడని ఆంజనేయులుకు కబురుచేశారు. అతను రాలేదు. గాని వెళ్లినవాళ్లు అతను మళ్లీ నాటకాల్లో పడ్డాడనీ, యీ మధ్యనే నాట్యకత్తెలు అమ్మాయనీ వార్త మోసుకొచ్చారు. పెద్దపురిటి బాలింతరాలు రామసీత ఇది విని ఉచ్చపడింది. తనలో తాను మల్లాగుల్లాలుపడింది. వితర్కించుకుంది. ఉన్నది కాస్తా శుభరంఐపోతోందని మథనపడింది.

"పోతే పోయింది. ఆయన కుదురుగా ఉంటే"-అనుకుంది.

గదిగుమ్మాన కట్టిన వెళ్ళ్ళ,కలశందా కనఱడ్డవి. చప్పున గుర్తుకొచ్చింది. పిల్లాణ్ణి చూచింది. "బ్రాహ్మడి కూతురు మాదిగాడి పెళ్లాం" అని రెండుమూడుసార్లు అంది. అన తీకక్షేమిటో? ఆ

బ్రాహ్మణిపూతు రెవరో. అమాదిగాదూ, ఆ బ్రాహ్మణికి కూతురూ ఎలా కాపరంచేశారో...కలిసిమెలిసున్నారో, కొట్లాడుకుచచ్చారో ...ఆ అమ్మాయి. కెన్నంతా ఎంత కుళ్లికుళ్లి ఏడ్చిందో...ఎన్ని మ్మకు ఈ పాట పాడితేసరి, రాదుట. ఆ పురుక్కీ, ఈ పాటకీ ఏమిటో సమ్మంధం ?

పథ్యం పెట్టారు. పురుడు సుఖంగానే వెళ్లింది. మాటలో చేక కేసేవాడు పేరుచెప్పిరావడం అంటే సిగ్గువేసింది. ఫలానావారి బిడ్డేను సుమా అని చెప్పడమా అనుకుంది. చీదరించుకుంది. నేను చెప్పనుపొమ్మంది. "ఇది ఆచారమే, జరగాలే" అని తల్లి నెత్తి నోరుపెట్టుకుని చెప్పింది. రామసీత ఎదురుతిరిగింది. "నన్ను నమ్మితే నమ్మండి" అంది. ఆమాట అంటూంటే ఆమెకళ్లల్లో జ్వాల భగ్గుమంది. తల్లి నోరు మెదపలేకపోయింది. "నలుగురూ—" అంది తల్లి.

"గంగలో కలవమను—పాటిమనుషుల్ని లేకిగా మాట్లాడే వాళ్లుట, చెప్పొచ్చారుట" అని రామసీత విరుచుకుపడింది. కాళీ అవతారం చూచి అందరూ నోరునొక్కుకుని చక్కాపోయారు.

"చిన్నప్పటినుంచీ అదంతే—" అందొకావిడ. అది రామ సీతకు తెలిసింది. "ఐతే అయ్యిందే" అంది. అంతే.

నెలపురుడు వెళ్లింది. ముత్తవతల్లి బిడ్డకికి చేతికి వొత్తులా అవి చేయించిపెట్టింది. తండ్రితో తతపోరి రామసీత కొడుకుకుమొలకు గజ్జెలు చేయించింది. గుడ్డటోపీ, చొక్కా తొడుక్కుని పసివాడు తొట్లో గిలక్కాయలు చూచి సంబరపడుతున్నాడు. ఓరోజు మధ్యాహ్నం భోజనాలు చేసి ఆడవాళ్లందరూ సావిట్లో కూచు న్నారు. లోకాభిరామాయణం విడిపడ్డది. ప్రవాహం వెళ్లి వెళ్లి ఆంజనేయులువీడికి వెళ్లింది.

"ఇప్పటికైనా వొచ్చాడేమో చూచావా?" అంది రామసీత తల్లి. ఆవిడా పెద్దదయింది. పచ్చగా, పార్వతీదేవిలా గుంటుంది. పొద్దున్నే ఆమెమొఖం చూచినా చాలు, పాపాలు పటిసిపోతయ్యం టారు అందరూ. ఆవిడ కెప్పుడూ ఇదే దిగులు. ఒక్క కొడుకూ, వొక్కత్తే కూతురూనూ. దేముడి దయవల్ల కలిగిన యింట్లో పుట్టి కలిగిన ఇంట్లోకే వొచ్చింది. పుట్టింటివారు ఆమెకు పసుపూకుంకం కింద నాల్గెకరాలుకూడా ఇచ్చారు. కొడుకు నలుగురితోపాటు సంసారం చేస్తున్నాడు. మొగుడు ఏమీ తక్కువవాడు కాడు. నాలుగట్టాలు నలుగురికి చెప్పి అవుననిపించుకున్నవాడే. ఒక్క కూతు రంటే—అది ఇల్లా తయారైంది.

దాని కడుపునకూడా ఓ కాయ కాచిందిగదా అని సంతో షించింది ముసలమ్మ. అల్లుడు తడిసిన పులక్కిక్కలాగా ఎప్పుడూ బిగబిగిసేఉంటాడు. అదో విసవసకొయ్య. రామసీత అక్కడే కూచుని పిల్లాడికి ఊలుటోపీ కుడుతోంది.

నెమ్మదిగా "అమ్మా!" అంది.

తల్లి తలెత్తి చూచింది. ఎంతసేపటినుంచో మాట్లాడని రామ సీత నోరువిప్పేసరికి తల్లీ, వొదినా ఆమెకేసే చూచారు.

"నాపెళ్లప్పుడు ఏమయిందే?" అంది. ముసలమ్మకు అర్థం కాలేదు. ఆవిడ శూన్యంలోకి చూస్తోంది. ఆమెముఖాన పెద్ద కుంకుమబొట్టు మెరిసింది. తల్లికి తాను అడిగేది అర్థంకాలేదనుకుంది రామసీత. ఇంకా విప్పి అడగటానికి పక్కయింటావిడ ఉంది.

పక్కయింటావిడా యిది గమనించింది. "వెళ్లొస్తానమ్మ పార్వతమ్మత్తా"అని వెళ్లిపోయింది. రామసీతతల్లిని పార్వతమ్మ అంటారు. అసలావిడపేరు సుబ్బమ్మ. నలుగురూ పార్వతమ్మఅనే అంటారు. వరసతో కలిపి.

"మేనరికం నీవు కొద్దన్నావా?" అనడిగింది రామసీత.

పార్వతమ్మకు చిత్రంవేసింది. తన కూతురు తనను నిగ్గ దీస్తోంది. మంచో చెడో, జరిగిపోయిన సంగతిని అసలువాళ్లు, అందులో తమ బిడ్డలు వొచ్చి నిలవేసిఅడిగితే జవాబుచెప్పడం కష్టం.

"ఎందుకే ఇప్పుడవన్నీనూ" అంది. ఆవిడకు పాతకథ కళ్ల ముందు తిరుగుతోంది. తాంబూలాలు ఆరోజున పుచ్చుకుంటారు. తనకు సుతరామూ ఈ మేనరికం ఇష్టంలేదు. "మా అక్కయ్య"- అన్నాడు తన భర్త. అప్పావధాన్లుగారంటే ఆ ప్రాంతాల్లో పేరె న్నికగన్న మనిషి. చిన్నప్పుడు ఆయన కనకమ్మ అక్కగారింటో వుండి తింటూ వేదం చదువుకున్నాడు.

"మా అక్కయ్య వునూరుమంటుంది" అన్నాడాయన.

"పిల్ల ఉసూరుమనదూ" అంది తను.

కాబోయే అల్లుడు వీథిఅరుగుమీద ఎవరొ్న యిద్దరుముగ్గుర్ని చేర్చాడు. తువ్వాలా తలకు చుట్టాడు. బీడీ అంటించాడు. నాట కాల్లో పద్యాలు పాడుతున్నాడు అప్పుడు. నేలనువాకే వారగోచీ, పలబనీనూ, బనీను కనబడేట్టు సన్నని చొక్కా, నుదురుమీద పడే క్రాపింగూ, లుంగచుట్టి ఉత్తరియ్యం మెడను వేసుకోడమూ, ఎంతెంతవాళ్లనూ ఉపాక్కరించి మాట్లాడ్డమూనూ అయ్యవని. అప్పావధాన్లుగారు కాస్సేపు మాట్లాడలేదు.

"చదువూసంధ్యలు లేకపోతే పోయింది. కుదురైనా లేదు గదా" అంది తను.

ముసిలాయన ఆలోచన్లో పడ్డాడు.

అరుగుమీంచి ఝామ్మని పద్యం మోగుతోంది.

"ఈ, కుండలి నన్ను దాగరిచె
క్రూరతనింక మనంగజాల నో
అంగజరాజ!"

"వీథిలోకి వెళ్లి అల్లుణ్ణి దర్శనంచేసుకురండి, తల కాళ్లు కడిగి నెత్తిన చల్లుకొందురుగాని!" అంది.

అవధాన్లుగారు ఉక్కిరిబిక్కిరైనారు.

"ఎప్పుడో మా అక్కయ్య ముక్కుల్లో చీమిడి తీసేసిందని— కడుపున పుట్టిన బిడ్డగొంతుక పిసుకుతారుటండీ!" అంది.

ఇంతలో రామసీత అక్కడికి వొచ్చింది. "రా అమ్మా!" అని తండ్రి కూతుర్ని వొళ్ళోకి తీసుకున్నాడు. తల నిమిరాడు.

కళ్ళల్లోకి చురచురా చూచి పార్వతమ్మగారు అక్కడినుంచి వంటింట్లోకి వెళ్లింది, యింట్లో అలికిడైతే.

"ఏరా అన్నయ్యా" అంటూ కనకమ్మ వొచ్చింది. తాంబూలాలుచ్చుకున్నారు అనాడు. ఇదంతా ఆమెకు కళ్లకట్టినట్టు కనిపించింది. ఫలితంగానా చూస్తున్నదేమో, కళ్లంబటి నీళ్లు వొచ్చె. కొంగుతో తుడుచుకుంది. మా సీతాయన యింతలో ఎందుకో పిల్చాడు. దొడ్డివసారాలోకి ఆమె వెళ్లిపోయింది.

"ఏమే అమ్మా!" అంది రామసీత.

"నిజమేనే అమ్మా. ఒడ్డన్నాను" అని వెళ్లింది పార్వతమ్మ. ఆమెగొంతుకలో ఏదో ఉండనించి మాట పెగిలిరాలేదు.

రామసీత అత్తారింటికి ప్రయాణం అయింది. తను కుట్టిన కోటు టోపీ కొడుక్కి తొడిగింది. నల్లని చొక్కా తొడిగింది. మొలకు గజ్జెలు కట్టింది. చేతిని వొత్తులు మెరుస్తున్నై. నెమ్మది నెమ్మదిగా చావడిలోగి పసుపురంగు తేలుతున్నాడు పాపాయి.

కొడుకు నెత్తుకుని తండ్రిదగ్గిరకెళ్లింది.

"మాహం బ్రహ్మ నిరాకుర్యాం, మామా బ్రహ్మ నిరాకరోత్— అనిరాకరణమస్తు. అనిరాకరణం మేఽస్తు" అని మంచంలో పడుకుని అప్పావధాన్లుగారు గొణుక్కుంటున్నారు.

"నాన్నా, వెళ్లొస్తా" నంది రామసీత.

ఆయన ఏదో చెప్పబోయారు. లేచికూచున్నారు. మాట తడబడింది. పిల్లవాణ్ణి తండ్రిచేతికి ఇచ్చింది. మనమణ్ణి ఎత్తుకున్నారు. ఆమె తండ్రికాళ్లకు నమస్కరించింది. తండ్రి వొరిగైపోయాడు. పూర్వకాలంమనిషిగనుక ఇంకా ఉన్నాడుగానీ. తండ్రి కూతుర్ని దీవించాడు. మనమడు తాతగారి ధోతీ తడిపాడు. 'అరివెధవా' అంది రామసీత. తాత ఆనందంతో నవ్వాడు.

"అమ్మా, నేను సన్యసిద్దా మనుకుంటున్నాను" అన్నాడు.

"ఈవయస్సులో వొద్దు నాన్నా" అంది.

"ఇదేనమ్మా వయస్సు. నాతండ్రి యజ్ఞం చేశాడు. నాతాత బ్రహ్మీభూతుడు. నామాతామహుడు ఆధానం చేశాడు. నేను వైశ్వదేవంఅయినా చెయ్యలేకపోయాను. సన్యసిద్దామని ఉందమ్మా" అన్నాడు.

రామసీత గంభీరురాలయింది. రక్తమాలిన్యం లేని కాలం. ఆ ప్రతిష్ఠ యివ్వాల్టికీ ప్రజ్వరిల్లుతోంది. ఆమెకు దరిద్ర నారాయణ మూర్తి గాంధీగారు గుర్తుకొచ్చారు.

"నాన్నా, ఒక్కమాట చెప్పనా!" అంది.

"చెప్పమ్మా" అన్నాడు తండ్రి.

"మనిషికంటె దేముడెవరు నాన్నా" అంది.

తండ్రి ఆశ్చర్యంతో, ఆనందంతో కన్నులరమోడ్చాడు.

"సాటిమనిషిని హింసించి హింసించి చంపి, ఎన్నియజ్ఞాలుచేస్తే ఏం నాన్నా" అంది.

అప్పావధాన్లుగారు తెల్లబోయారు.

"నీ వొళ్లుమాత్రం ఏంబావుంది నాన్నా. సన్యసించకు నాన్నా" అంది.

అప్పావధాన్లుగారు మాట్లాడలేదు.

"నాప్రాణాలు నీమీదా, అమ్మమీదా ఉన్నై. ఇప్పుడు ఈ మహారాజు(కొడుకు)మీదానూ. నీఆరోగ్యం వారానికోమాటన్నా రాయించు నాన్నా. మేం జవాబన్నా రాయమనుకో. నాకోసం మీఆరోగ్యం రాయించాలి నాన్నా" అంది.

"అలాగే అమ్మా" అన్నాడు తండ్రి. మాట్లాడలేకపోయాడు.

"సన్యసించవొద్దు నాన్నా" అంది.

అవధాన్లుగారు తల ఊపారు. మళ్లీ తండ్రికాళ్లకు నమస్కరించింది. ఆయన వేదోక్తాశీర్వచనం చేశారు. పిల్లవాణ్ణి చేతికిచ్చారు.

"బయలుదేర వేమే—" అంటూ అన్నగారు వొచ్చారు. "వెళ్లొస్తానే అమ్మా" అని చెప్పింది. పిల్లాణ్ణి తల్లిచేతికిచ్చింది. తల్లికీ, వొదినగారికీ పాదాభివందనం చేసింది. తల్లి దీవించింది. వొదినగారు కుంకంబొట్టు పెట్టింది. బండీ ఎక్కింది. దార్లో అన్న—

"రామసీతా!" అన్నాడు.

తలెత్తింది.

"నీవు ధైర్యంగా ఉండు. నీకేమే, మొగబిడ్డకూడా పుట్టాడు" అన్నాడు. మొగపిల్లాణ్ణి కంటే అక్కడితో పెట్టుక్కనట్టు. కోర్టు కెళ్లినా ఢోకాలేదు అన్నమాట.

"నీవు ధైర్యంగా ఉండు. ఆ పసుపు, వాడెప్పుడూ అంతే. పిల్లాణ్ణి చూట్టానికైనా తల్లీ, కొడుకూ యిద్దర్లో ఒక్కరన్నా రాలేదు. వాళ్ల వరస తెలుస్తూనే ఉంది."

రామసీతకు ఏమనాలో తోచలేదు. అన్నకేసి చూస్తోంది.

"నీకేం ఫరవాలేదు. నీవు ఏమీ చెయ్యవు. ఏం చేసినా నేనున్నంతకాలం మరేమీ ఇదిలేదు" అన్నాడు.

"నాన్నా అమ్మా కులాసా రాయవుట్రా" అంది ఆమె.

అత్తారింటికొచ్చింది. ఆంజనేయులు ఊళ్లో లేడు. ఎక్కడికో నాటకాల కని వెళ్లాడు. కనకమ్మ ఉంది. అదివ దృష్టితీసింది. ఎర్రనీళ్లు తీసిపోసింది. ఉయ్యాలతొట్టి వేశారు.

బారసాల జరిగింది. అందరూ వొచ్చారు. ఎల్లాగో అల్లా వోపిక చేసుకుని అప్పాపుధాన్లుగారుకూడా వొచ్చారు. బారసాలపీటల మీద ముత్తవ పాపాయికి రెండెకరాలు చదివించింది. తాతగారు అల్లుడికి ఏరికోరి ఖద్దరుపంచెలు తెప్పించి మరీ పెట్టారు. అల్లుడు మారా డని ఆయనకు ఏం తెలుసు? ఎప్పుడో కూతురు చెప్పిన మాట గుర్తుంది ఆయనకు-అంతే.

౪

అంజనేయులుకు కొత్తపిచ్చి పట్టుకుంది. నాటకాలు, రాటం, పీకులు, అసు, చిలపలూ మూలపడ్డయి. నాకిట్లో ఓ పాతతుక్కు మోటారు ఒకటి చెలిపింది. దాన్ని అతను అన్ని అడ్డగోలుడొంక ల్లోంచీ నడిపించుకువచ్చాడు. ఇప్పు డతను కారు తోలగలడు. చిన్న సర్వీస్ ఒకటి పెట్టాట్ట. మరో నాలుగెకరాలు అమ్మాడు—పిల్లాడు రేపో మాపో పుట్టాడనగా.

కాపరం బస్తీకి తర్లింది. అంజనేయులు మూడురోజులకూ నాలుగురోజులకూ ఓసారి యింటికి వొస్తాడు. ఓపూటో అరపూటో వుంటాడు. ఎవళ్లో వొచ్చి పిలుస్తారు. వెళ్లిపోతాడు.

రామసీతకు పసివాడితో పొద్దు కాస్తన్నా తెమిలేదు కాదు. తెమిలిన కాస్తా చదవడమూ, రాటం తిప్పడమూ చేస్తోంది.

రామసీత పీపుగట్టితనాన్ని గూడా పరిశీలించుకోవలసిన రోజు లొచ్చై. అంజనేయులు నోపట్టాన ఇంటికిరాడు. వొస్తే వొకటి రెండురోజులు కదలడు. ఎప్పుడూ చిరచిరలాడుతూ వుంటాడు.

రామ్మూర్తి (కొడుకు) అల్లరిచేస్తుంటే అతనికి ముద్దురాదు. కోపం వొస్తుంది. రామసీతకు కోపంరాదు. ముద్దువొస్తుంది.

"పిడి గజ్జలతాడు ఏంచేశా?" అన్నా డోరోజన భార్యతో.

"జాగర్తగానే ఉంది. ఏం?" అంది రామసీత.

"కావాలి".

"ఎందుకు?"

"డబ్బులు పుట్టించుకురావాలి."

"తాకట్టు పెట్టారా, మంచిమాటే, ముందే చెప్పారు.నయం."

అంజనేయులు 'తే' అన్నాడు. గొంతికలో శరం తొణికిస లాడుతోంది.

"నే నివ్వను."

"ఇస్తావా, ఇవ్వవా?"

"చంపినా సరే ఇవ్వను."

అంజనేయులు బలవంతాన ఆమెపెట్టె తీయబోయాడు. రామ సీత అడ్డంవెళ్లింది. ఆమె నొక్కతోపు తోశాడు. మళ్లీ అడ్డంవెళ్లింది. అంజనేయులుకు కోపం వొచ్చింది. కొట్టాడు.

దెబ్బతిన్న రామసీత తాచుపాం అయింది. కాని, వెంటనే తలవొంచుకుంది.

"ఏమైనాసరే-వాడివి నే నివ్వనండీ!" అంది ఏడుస్తూనే.

"నీ అబ్బసొమ్మా?"

నోరుజారింది అంజనేయులుకు. అనేశాడు.

"ఆ. నా అబ్బసొమ్మే" అంది రామసీత నిప్పులుకక్కుతూ.

చేసేది లేక అంజనేయులు వెనకడుగు వేశాడు. తన మెళ్లో గొలుసు తీసి యిచ్చింది రామసీత మొగుడికి. అంజనేయులు నిర్విణ్ణు డైనాడు. పుచ్చుకోడమా, వొద్దా అనుకున్నాడు. వొద్దనుకున్నాడు. తీసికెళ్లి భార్యకిద్దామని లేచాడు. అవసరం నెత్తికెక్కి తొక్కు తోంది. కారుకు టైరు కొనాలి. దర్జాగా తీసుకున్నాడు. చొక్కా తొడుక్కుని వెళ్లిపోయాడు. అత్తగారు కిమిన్నాస్తి. కళ్లప్పచెప్పి చూస్తూ ఊరుకుంది.

రామ్మూర్తికి రెండేళ్లు నిండై. ప్రతివాళ్లనూ తిడతాడు. కొడతానంటాడు. కర్రముక్క పుచ్చుకుని బయలుదేరుతాడు. ఎప్పుడూ దుమ్ములో ఆడుకుంటాడు. చొక్కాతొడగడం అంటే భయం వేస్తోంది. నిమిషంలో మన్నుచేసుకు వస్తాడు. ఎప్పుడూ దిస మొలగానే ఉంటాడు.

"ఓ రామయ్యతండ్రీ, నే వేగలేకున్నానురా నీతో" అంటుంది రామసీత.

"అమ్మ అమ్మ, వాళ్ల బ్బాయిని కొట్టిరానా?"

"తప్పు" అని కళ్లు పెద్దవిచేస్తుంది రామసీత. ముక్కుమీద వేలు వేసుకుంటుంది.

"తప్పా?"

"ఊఁ"

"తప్పంటే?"

తెల్లపోతుంది. రామసీత తన కొడుకు కొడతానని కర్ర ముక్క పుచ్చుకున్నప్పుడల్లా ఆమెప్రాణాలు కువ్వకువ్వమనేవి.

వోరోజన అంజనేయులు కూచుని ఉన్నాడు. రామ్మూర్తి "నాన్నా, నాన్నా" అంటూ దగ్గిరికెళ్లాడు. అంజనేయులు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"నాన్నా, వాళ్లబ్బాయిని కొట్టిరానా?"

"ఊఁ!"

రామ్మూర్తి లేచాడు. కర్రముక్క తీసుకున్నాడు. రామసీత ఇదంతా చూచింది. దబదబా వొచ్చింది.

"ఎక్కడికిరా?"

"అల్లింటికి"

"ఏడిశావు. డా. నీకు జెండా చేసిపెట్టనా..."

"జెండా. జెండా. చేదిపెట్టు"

చీరముక్క తుంచింది. మంచంలోంచి కొత్త నులక తోసి తెచ్చింది. ఎల్లాగో అల్లా జెండా చేసిఇచ్చింది. రామ్మూర్తి నవ్వు

తున్నాడు. జెండా చేతికి రాంగానే కిలకిలా నవ్వాడు. ఎగిరి గంతేశాడు. 'జై' అంది తల్లి. రెట్టింపు అల్లరితో 'జై' అని అరిచాడు కొడుకు.

"ఎవర్నీ కొట్టకూడదు" అంది.

"జెండాతో కూడానా?"

"ఆ. కొడితే జెండా కోప్పడుతుంది."

"కొట్టనులే" అన్నాడు రామ్మూర్తి.

"నాన్నా, జెండా...ఎవర్నీ కొట్టకూడదు. జెండా కోప్పడుతుంది" అన్నాడు వాడు.

ఆంజనేయులు 'బాగానేవుంది' అన్నాడు. గొంతికలో ఏరసమూ ప్రస్ఫుటంకాలేదు. మాట్లాడకుండా రామసీత వెళ్లిపోయింది.

మైనరు ఉన్నాడుగనక ప్రామిసరీనోట్లకు డబ్బులు రాలడం లేదు. పగడాల తావళమూ, పుస్తెలతాడూ, ముసలమ్మ రుద్రాక్షల తావళమూ హారతికర్పూరం అయింది. రైతుదగ్గిరి వెళ్లి పై సంవత్సరంపంటకూడా తెచ్చుకుతగలేయడంకూడా అయింది. ఆ మోటారుకారు "లే లే!" అంటుందేగాని 'తీసుకో' అని ఒక్కవాడూ అనడు. కారుకిందే కర్చవుతోందో, మరేమవుతోందో గాని, బూడిదలో పన్నీరు చాలా పోశారు.

"జెండాకూ జై!"-రామ్మూర్తి అరుస్తూ ఆడుకుంటున్నాడు.

అప్పాపుఖాన్లుగారికి సుస్తీగా ఉందని ఉత్తరం వొచ్చింది. ఆంజనేయులు ఊళ్లో లేడు. రామసీత కుప్పకూలినట్లు కూలింది. కనకమ్మ కాలుకాలిన పిల్లిలాగా తిరిగింది. నుంచోలేదు. కూచోలేదు.

"జెండాకూ జై!"

"రాముడూ, రా" అంది రామసీత.

వొచ్చాడు.

"అరవకూడదు"

"నువ్వే చెప్పావుగా"

"ఇప్పుడు అరవకూడదు. తాతయ్యకు సుస్తీగా ఉందిట."

"అమ్మా, అరిస్తేనే పోతుంది. ఇందాకా మేకపిల్ల భయపడి పోలా?"

రామసీతకు నవ్వురాలేదు. 'అరవకూడదమ్మా' అంది. గదిలోకి వెళ్లి రెండుమూడు చీరలూ, పిల్లాడికి బట్టలూ తీసుకుని మూట కట్టింది. కనకమ్మ వొచ్చి సావిట్లో కూచుంది. ఆవిడమొహాన కత్తి వేస్తే నెత్తురుచుక్క లేదు. ఎంత ఇదైనా రక్తసంబంధం. తల్లితోడు. పేగు తోడుతుంది. అన్నకు ఆవయస్సులో సుస్తీ అంటే ఏమిటి? కళ్లనీళ్లను ఆపుకుంటోంది కనకమ్మ.

"బయలుదేరవూ అత్తయ్యా" అంది రామసీత.

"వాడు లేడే అమ్మా!" అంది అత్తగారు.

"నేనుండలేను. పోతున్నాను" అంది రామసీత.

"వెళ్లగానే కార్డుముక్క రాయి! వాడు రాంగానే నేనూ వొస్తా" నంది కనకమ్మ.

"వొక్కత్తెవూ ఎలా వెళ్తా" వంది మళ్లీ.

ఈవంకను ప్రయాణం ఆగుతుందికాబోలు ననుకుంది రామసీత.

"నోరుందిగదా. అడుగుతాను, వెళ్తాను."

"బస్సుమీదే వెళ్తావా?"

"ఆ"

"...—..."

"నాపెట్టెఅడుగున అయిదురూపాయలు దాచా నిన్నాళ్లూ. అది తీసుకువెళ్తున్నాను. మీఅబ్బాయితో చెప్పండి. వారినికూడా ఓసారి రమ్మని చెప్పండి. కూతురు నిచ్చుకున్నా, మేనమామే. వొస్తే ఎవ్వరూ నవ్వరు" అంది. పిల్లాణ్ణి చంకనేసుకుని మూటపుచ్చుకుని బయలుదేరింది. సందుచివరిదాకా అత్తగారూ వొచ్చింది. కోడలు అన్న చివరిమాటకు ఆమెకు భగ్గుమంది. ఐనా, ఇప్పుడు కాదని తమాయించుకుంది. "పిల్లాడు పుట్టినప్పుడు రాలేదని దెప్పడం. ఎంత ముసలిదానైనా అర్థంకాకపోదు" అనుకుం దామె.

తను యింటికి చేరేప్పటికి వీధివాకిట్లో పెట్టుకుని ఏడుస్తూంటారేమో అని ఆమె బహు బాధపడింది. చూపులన్నా అందుతాయో అందవో అని మథనపడింది. 'ఈవయస్సులో తల్లి—' యిది గుర్తొచ్చి మరీమరీ ఇదయింది. దిక్కుమొహం పడ్డది.

రామసీత వొచ్చిందంటే రామసీతవొచ్చిం దన్నారు. తల్లి బావురుమంది. అప్పాపుఖాన్లుగారు, ఆసన్నమృత్యువు, మంచాన్ని అంటిపెట్టుకుని వున్నారు. స్పృహ ఏమీ చెడలేదు. విరేచనాలు ప్రారంభం అయినవి. పోసిన మందులు వొంటపట్టటంలేదు.

"అమ్మాయి వొచ్చిందా?" అన్నారు.

"ఆ. వొచ్చా నాన్నా"

"వొచ్చావా అమ్మా. రా"

వివస్త్రుడు. నులకమంచంమీద గోనెపట్టాలో పడుకుని ఉన్నాడు. వేసే పాత్రిల్లగుడ్డ వేస్తున్నారు. తీసేది తీస్తున్నారు.

"నీపిల్లా డేడీ?"

"ఇడుగో"

"తాతయ్య!" అని కొడుక్కు చూపించింది రామసీత.

"తాతయ్యా" అన్నాడు రామ్మూర్తి.

తాతగారు కళ్లెత్తిచూచారు. "నాన్నా, తాతయ్యకు సుస్తీ" అంది రామసీత. ఏడుస్తోంది.

"జెండాకు జై"—అరిచాడు రామ్మూర్తి.

"తాతయ్యా!"

"ఊ"

“ఎప్పోలా?”

అందరూ నవ్వారు. తాతగారూ నవ్వారు. రామసీత ‘శ్రై’ అని అరిస్తే పోవటం ఏమిటో విప్పిచెప్పింది. “వోరి ధడవా” అని అందరూ అంగలార్చారు. అప్పావుధాన్లుగారు నవ్వారు. చెలిసిపోయిన గుడ్డలాగుంది ఆ నవ్వు.

వైద్యుడు శేషాచార్లు వచ్చాడు. నాడి చూశాడు. పూర్ణిమనాటిదని చెప్పాడు. ముసిలమ్మ గొల్లుమంది.

మర్నాడు తండ్రిదగ్గర రామసీత కూచుంది. మిగతా అందరూ భోజనాలు చేస్తున్నారు. రోగిదగ్గర వొకరు ఉండడం, మిగతావాళ్లు గబగబా అన్నాలు కానివ్వడం రివాజు అయింది.

“అమ్మా”

“ఏం నాన్నా”

“ఇవాళ దాహం ఒకటి కొత్తమ్మా”

“అల్లాగా” అంది రామసీత. ఉద్ధరిణతో కాశీన్నీళ్లు గొంతుకలో పోసింది.

“అమ్మా”

“ఓయ్”

“ఇహా నే సన్యసించవొచ్చా అమ్మా”

రామసీత తెల్లపోయింది. తాను వొద్దన్నది గుర్తుకొచ్చింది. అందువల్లనే ఆగాడుకాబోలు తండ్రి అనుకుంది. పెద్ద నిట్టూర్పు వొచ్చింది. మొహం గమత్తుగా మారింది.

“సన్యసించాలని వుందా నాన్నా” అంది. ఆమాట అనటం అనవసరం. అయినా ఆగలేక అంది.

“ఆరోజున—”

“అర్థమయింది నాన్నా”

“దొడ్డిపసారాలో పడుకునిఉన్నాను. నువ్వు వెళ్తూ వెళ్తూ వొద్దన్నావు. అప్పుడు ఎదురుచెబితే ఎక్కడ శపిస్తావో అనిపించిందమ్మా” అన్నాడు.

రామసీతకు కళ్లంబడి నీళ్లు వొచ్చై. చెరుగుతో తుడుచుకుంది.

“నీవుసురు నాకు తగలగూడదు. తగలనీకు—”

“అదేంమాటలు నాన్నా”

“కాదమ్మా. నీ సుఖం నే చేతులారా చిచ్చెట్టా” అన్నాడు. ఆప్రాణికి ఆ అంతిమఘడియల్లో కళ్లనీళ్లు వొచ్చాయి. బడబాగ్నిని ఎంతకాలం దాచుకున్నారో ఆయన. రామసీతకూ కళ్లనీళ్లు వొచ్చై.

“ఇప్పుడెందుకు నాన్నా—” అంది రామసీత. తండ్రి వినిపించుకోలేదు. ఆయన చెప్పదలచుకుంది చెప్పేస్తున్నాడు. ఇక ఆగదు ఆ ప్రాణి.

“మీఅమ్మపేర నున్నది నీపేర పెట్టించా. శే శే అని శేపు వాడెక్కడ నిన్ను చంపుతాడో అని నీవు అమ్మటానికి వీల్లేకుండాను, నీపిల్లాడికి చెందేట్టూ రాయించా...” అన్నాడు.

రామసీత కొత్తలోకంలో ఉంది. తనను తలుచుకుని తండ్రి ఎంత కుళ్లికుళ్లి ఏడ్చాడో...తండ్రి మొఖంకేసి పరీక్షగా చూచింది. తపశ్శక్తిసంపన్నాలయిన కళ్లు, మాటతిభావతును ఎరగని ఆకళ్లు యిటికరాయి ముక్కల్లాగా ఉన్నై.

“అమ్మా!”

“ఆఁ”

“నన్నేమీ శపించకు.” అని ఏడ్చాడు అప్పావుధాన్లుగారు. అన్నగారు భోంచేసివొచ్చి చూశాడు. తప్పిద్దామని అనుకుని గూడా ఏమీ చెయ్యలేకా, ఆ దృశ్యం చూడలేకా తలవొంచుకొని బరువుగా వెళ్లిపోయాడు.

“శెండాకు శై—” రామమూర్తి అరుస్తూవొచ్చాడు. తల్లి తాతమంచందగ్గిర ఉంది.

“తాతయ్యకు ఇంకా తగ్గలా” అన్నాడు.

“వోరి ధడవా” అన్నారు తాతగారు. అది వారి ఆశీర్వచనం.

అప్పావుధాన్లుగారు సన్యసించారు. బ్రహ్మఘాతులూ అయారు. వారి చావు పెళ్లితో సమానం. ముసిలమ్మమూలేగాని, పచ్చని పండుముత్తయిదువు పార్వతీదేవికి చేటువొచ్చిందిగానీ, ఆయన కేం మహారాజా అన్నారు అందరూ.

ఆంజనేయులూ, కనకమ్మా వొచ్చారు. వెళ్లారు. రామసీత మొగుడితోపాటు వెళ్లలేదు. తల్లికోసం అని ఉండిపోయింది. ఆంజనేయులుకు ఆస్తి వొచ్చినసంగతి తెలిసింది. అతని కేమీ సంతోషం రాలేదు. మనిషి చిక్కిపోయాడు. మొకటి నేవళం లేదు. తోస్తే పడేట్టున్నాడు. ఇంటికి అల్లుడు వొచ్చినట్టు రాలేదు. ఏకో, ఎవరో వొచ్చినట్టు వొచ్చాడు. మేనమామ పోయాడని అతను ఏడ్చాడు. కాని, ఏడ్చాడని చెప్పినా ఎవరూ నమ్మేట్టులేదు. ఢకమారింది.

“వొస్తావా?” అనడిగాడు ఆంజనేయులు భార్యను.

“ఎల్లా రాను చెప్పండి” అంది రామసీత.

రామసీతమొహాన నవ్వు, నిండూ లేదు. ఎండి వాడిపోయిఉంది.

“కోడలుండిగా అమ్మా. అయినా ఆఁడకూతుళ్లు ఎన్నాళ్లుంటారేం? ఆస్తిఇచ్చిన తల్లయితే ఉంటారేమో” అంది కనకమ్మ అక్కడా అక్కడా. నోరుందిగదా అని అన్నట్టున్నై ఆమాటలు. ఎవరూ పట్టించుకోలేదు వాటిని.

తల్లీ, కొడుకూ వెళ్లిపోయారు.

రామసీత పుట్టింట్లోనే ఉండిపోయింది.

రెండుమూడు నెలలు గడిచై. ముసిలమ్మ మరి మంచం దిగలేదు. ఆవిడా రోజులు వెళ్లదీస్తోంది.

చిన్నప్పుడు తల్లి చేసినదానికి తిరిగి చేసి ఋణం తీర్చుకుంటోంది రామసీత.

మనోహరమైన ప్రవాదలు గాలిలో తేలిపోతున్నవి.

రామసీతకు అక్కడ ఎవడో ఉన్నాడుట. వాణ్ణి విడిచి రాలేదుట. దీనికి యింట్లో అందరూ హర్షించారుట. అందుకే అల్లా ఆస్తి రాసి ఇచ్చారుట. లేకపోతే కాపరానికి రాదా అనట.

రంకుకట్టడం తేలిక. మరొకరికి రంకుకట్టుతూంటే చెవులు దోరపెట్టుకుని వినేవా ళ్లుంటారు. ఇకిలిస్తారు. పోతారు. నమ్మితే నమ్మనూ నమ్ముతారు. ఆలోచించరు. ఆలోచిస్తే ఆ వికిలితృప్తి పోతుందేమో నని భయం.

కట్టుబడిన మనిషి!

రామసీత చెవులనూ పడ్డవి ఈమాటలు. ఆమె ఏమనుకుందో ఏమో, పెదిమ విప్పలేదు.

తల్లి కొత్త నయంగా ఉంది. "చేసినా ఇంతేనమ్మా. కాపరం చెడగొట్టుకోకు" అందావిడ. "వెళ్తా లెమ్మా" అంది రామసీత. "వెళ్లకపోతే ఏమ"న్నాడు అన్నగారు. వొదినగారు ఎటూ అనలేక పోయింది. "ఆడివిళ్ళే అన్న వాళ్లు పురుగులుపడిఛస్తా"రని కసితీరా అంది ఆమె. ఆడబిడ్డను వెనకేసుకొచ్చి అన్నదంటే నిజమైఉంటుందనైనా అనుకోదుకాబోలు ప్రపంచం.

తల్లే బలవంతాన కూతుర్ని ప్రయాణం చేయించింది. తల్లిని విడిచి కూతురు వెళ్లలేకపోయింది. ఎదురుగాలిలో ముందుకెళుతున్న కెండాలాగా ఆమె అత్తింటికి వెళ్లింది.

పాత్రసామగ్రికూడా సర్వమంగళం అయింది. ఓపంచ నంటున్నారు. మరో మైపంటుగూడా ముందే తెచ్చి అప్పులు కొన్ని తీర్చారు. వొకటో రెండో పతాలున్నై. రామసీతను చూచి అత్తగాని, మొగుడుగాని ఆదరించలేదు. సత్రంలోకి ఎవరో వొచ్చి పెడుతూంటే చూస్తున్నట్టు చూచారు.

"యిల్లా ఉన్నారే" మంది రాముసీత మొగుణ్ణి. అంజలేయులు ఉలకలేదు, పలకలేదు. ఆరాత్రి ఎల్లాగో అల్లా మూత్తుడుచుకున్నారు. ఉప్పు ఉంటే పప్పు లేదు. ఉలుపుంటే కారం లేదు. ఆరాత్రి భార్యాభర్తలు ఎడమొహం పెడమొహంగానే ఉన్నారు. భర్తగదా అని దగ్గరికి పోబుద్ధిపుట్టలే దామెకు. చేసుకున్న భార్యగదా అని అతనూ పిలవలేదు. చాప పరుచుకుని, కొడుకుని దగ్గిరెట్టుకు పడుకుంది. పనివెధవ కెండాను పట్టుకునే పడుకున్నాడు.

తెల్లారింది. దుద్దులూ, ముక్కుపుడకలూ తీసింది. అత్తగారి చేతి కిచ్చింది.

"ఎందుకు?"

"కావలసినవి కొనుక్కుందాం" అంది రామసీత.

"నాకు తెలీదు. మీఆయనకు ఇవ్వు. అయినా ఇవేం చాలుతై?"

"మంగళసూత్రం ఉందిగా" అంది.

"అదికూడా తీయాలనుకోకు తల్లీ. వా డింకా నన్ను దాటెయ్యాలి. నీకు పుణ్యముంటుంది." అంది అత్తగారు ఏడుస్తున్న గొంతికతో.

రామసీత నొచ్చుకుందో, ఏమయిందో తెలీదు. ఆమె ఏ ఉద్దేశంతో ఆమాట అందో అది దుమ్ముఅయింది.

భర్తకు ఆ రెండూ ఇచ్చింది. 'అక్కర్లేదు' అన్నా డతను. అంజనేయులు గొంతిక పొడిఆరిపోయింది. అల్లా మాటలు వొస్తున్నై. రాత్రి తను పరకాయించి చూడలేదు. బాడిద గుమ్మడికాయరంగు వొస్తోంది. మనిషి ఎండిపోతూన్నాడు.

"మీయిష్టం" అని వాటిని అక్కడే పెట్టింది. ఇవతలికి రాబోతూంది.

"వాడు పెళ్లమంటేనే వచ్చావా?" అన్నాడు. దగ్గుతెర వచ్చింది. కళ్లె ఉమ్మేశాడు. ఆయాసపడుతున్నాడు.

"వాడెవడు ?" అంది రామసీత.

"ఆడే - నీ కొత్త మొగుడు."

రామసీత భరించలేకపోయింది. వెనక్కు తిరిగింది. అంజనేయులు మళ్లీ దగ్గి కళ్లె ఉమ్మేశాడు.

ఇంట్లోకి వొచ్చింది. గాంధీగారి బొమ్మా, రాముడిబొమ్మా ఇంకా బజారు కెళ్ల లేదు. నోమూల మేకును అంటిపెట్టుకున్నవి. ఆమె కొడుకు నెత్తుకుని సరాసరి అక్కడికి వొచ్చింది. పతాలకు దణ్ణం పెట్టింది. తల్లితోపాటు కొడుకూ దణ్ణంపెట్టాడు.

"పరాత్పరా! చాలు ఈమాటలు" అంది. గొంతిక వొణికింది. "వైధవ్యం వొచ్చినా సంతోషిస్తాను. ఈకాపరానికి ఒక దణ్ణం" అనుకుంది. లెంపలు వేసుకుంది. కొడుకూ తల్లిని చూచి లెంప లేసుకున్నాడు.

"ప్రభూ, ఒక్క దణ్ణం" అని నిట్టూర్చింది రాముసీత.

